# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక

RNI - TELTEL/2023/87644

సంచిక 17 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | జూలై 16, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


## నీలగిరి నిత్యపద్యం

**ఆటవెలది**

ప్రజల సేవ కొరకు ప్రతినిమిషము గూడ
పరితపించు నట్టి పాలకులను
మరువకండి మీరు మన ఎన్నికలలోన
ఓటు వేయవలయు మేటిగాను

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్)
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.


# పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యంగా ప్రోత్సాహం

## - గత ప్రభుత్వాల పాలసీలను కొనసాగిస్తున్నాం

**మా ప్రభుత్వానికి పాలసీ పెరాలసిస్ లేదు**

**పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు 9 టిఎంసిల నీటికి యత్నం**

**దివిటిపల్లిలో అమరరాజా బ్యాటరీ ప్రారంభించిన సిఎం రేవంత్**






**మహబూబ్‌నగర్,జూలై 15 :**తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా గత ప్రభుత్వాల పాలసీలను కొనసాగిస్తున్నామని, అందులో మంచివుంటే మరింత మెరుగ్గా ముందుకు సాగుతున్నామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. మా ప్రభుత్వానికి పాలసీపెరాలసిస్ లేదని అన్నారు. గత ప్రభుత్వాల పాలసీలను మరింత మెరుగుపర్చి ముందుకు తీసుకెళు ్తన్నాం అని అన్నారు. 1994 నుంచి 2004వరకు చంద్రబాబునాయుడు, 2004 నుంచి 2014వరకు వైస్ రాజశేఖర్ రెడ్డి, 2014 నుంచి 2023డిసెంబర్ వరకుగత ప్రభుత్వాలు తీసుకువచ్చిన పాలసీలను మా ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందన్నారు. గతప్రభుత్వాల మిగతా2లో...




## 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం

- ఫ్యూచర్ సిటీలో అమెజాన్‌ది కీలక పాత్ర
- అత్యంత అధునాతనంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- అమెజాన్ కొత్త డేటా సెంటర్‌కు సీఎం శంకుస్థాపన

**హైదరాబాద్,జూలై 15 :** రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పెట్టుబడులపై ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ కొత్త డేటా సెంటర్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అమెజాన్ డేటా సెంటర్ ఫ్యూచర్ సిటీలో కీలక పాత్ర పోషించనుందని అన్నారు. అత్యంత అధునాతన నగరంగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ఇక్కడ మరిన్ని పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాం. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతం ఉండాలనేది మా లక్ష్యం. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యాన్ని చేరుకుంటాం. ఐఎస్‌బీ, నల్సార్ సహా అనేక సంస్థలతో కలిసి పనిచేస్తున్నాం. పారిశ్రామికవేత్తలకు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. తెలంగాణ అభివృద్ధిలో ఓఆర్ఆర్, విమానాశ్రయం, ఫార్మా కంపెనీలు అనేక సేవలు మిగతా2లో...

## కరీంనగర్ అభివృద్ధికి కృషి చేస్తా...

**- సిసి రోడ్డు పనులకు బండి శంకుస్థాపన**



**కరీంనగర్,జూలై 15 :** కరీంనగర్ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకుని వచ్చేందుకు కృషి చేస్తానని కేంద్ర మంత్రి బండి సంజయ్ మిగతా2లో...

# మేడిగడ్డపై కేంద్రం తీరు దారుణం

- ఎన్‌డిఎస్ఎ రిపోర్టుపై మండిపాటు
- పోలవరం విషయంలో ఒకలా..ఇక్కడ మరోలా
- రాష్ట్ర ఇంజనీర్ల నివేదికను బహిర్గతం చేయాలి
- సిసిఐని తెరిపించాలని కేంద్ర మంత్రికి వినతి
- ఢిల్లీలో మీడియాతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్




**న్యూఢిల్లీ,జూలై 15 :** గతంలో పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతింటే.. ఎన్డీఎస్ఏ పట్టించుకోలేదు. మేడిగడ్డ పిల్లర్ కుంగితే మాత్రం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని కేంద్రం తీరుపై కెటిఆర్ మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీపై నివేదిక ఇచ్చింది ఎన్డీఎస్ఏ కాదు.. ఎన్డీఏ అన్నారు. దిల్లీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మేడిగడ్డ విషయంలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) తీరుపై కేటీఆర్ విమర్శలు చేశారు. తెలంగాణలో కోటి ఎకరాలకు పైగా నిషేధిత జాబితాలో చేర్చారు. రెవెన్యూ మంత్రి 30 శాతం వసూళ్లు చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలకు చేస్తున్న పనులకు పొంతన లేదు. కాళేశ్వరంపై ఆయన పగబట్టి వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ఇంజినీర్లు మిగతా2లో...

## 2028 నాటికి వరంగల్ ఎయిర్‌పోర్టు పూర్తి

**- బిజెపి అధ్యక్షుడు రాంచంద్రరావు వెల్లడి**



**హైదరాబాద్,జూలై 15 :** వరంగల్ ఎయిర్‌పోర్టును 2028 నాటికి పూర్తిచేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచం దర్‌రావు తెలిపారు. ఈ మేరకు కేంద్రప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందోన్నారు. అయితే ఆ క్రెడిట్ తీసుకునేందుకు సీఎం రేవంత్ ప్రయత్నిస్తున్నారని మిగతా2లో...




## త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటన**

**హైదరాబాద్,జూలై 15 :** ఈనెలలోనే 50 నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గతంలో పనితీరు కనబరిచిన వారిని రెన్యూవల్ చేసే అవకాశం ఉందన్నారు. డీసీసీల పనితీరు బాగోలేకపోతే మార్చే అవకాశం ఉందని వెల్లడించారు. పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్‌తో చర్చించామని తెలిపారు. రెండు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అవుతామన్నారు. రెన్యువల్ విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. మండల కమిటీలో డీసీసీల రిపోర్ట్స్ ÷నైల్ అని స్పష్టం చేశారు. మిగతా2లో...

## కెసిఆర్‌ది ఫామ్‌హౌజ్ పాలన

**- కెటిఆర్ విమర్శలపై మండిపడ్డ పొంగులేటి**

**హైదరాబాద్,జూలై 15 :** దిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పందించారు. కేసీఆర్ పదేళ్ల పాలనను 'ఫాంహౌస్ పాలన'గా ఆయన అభివర్ణిం చారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని వినియోగించు కోకుండా ఫాంహౌస్‌కే ఆయన మిగతా2లో...



## తెలంగాణలో సర్ నమోదు పక్రియ

**గడువును అగస్ట్ 3 వరకు పొడిగించిన ఎన్నికల సంఘం**

**హైదరాబాద్,జూలై 15 :** తెలంగాణలో సర్ నమోదు పక్రియను కేంద్ర ఎన్నికల సంఘం ఆగస్టు 3 వరకు పొడిగిం చింది. సెప్టెంబర్ 9 వరకు మిగతా2లో...



## చల్లని కబురు చెప్పిన వాతావరణ శాఖ



# పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యంగా ప్రోత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

పాలసీల్లో ఉన్న మంచి మేం కూడా ప్రోత్సహిస్తున్నాం.. మహబూబ్ నగర్ జిల్లా దివిటిపల్లిలో అమర రాజా గిగా కారిడార్‌లో కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ తయారీ యూనిట్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. మంత్రులు శ్రీధర్ బాబు,జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి,అమర రాజా గ్రూప్ చైర్మన్ గల్లా జయదేవ్,ప్రభుత్వ విప్ యన్నం శ్రీనివాస్ రెడ్డి,ఎంపీ లు డీకే అరుణ,మల్లు రవి, ఉమ్మడి జిల్లా ఎంఎల్ఏ లు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హాజరయ్యారు. అమర రాజా గిగా కారిడార్‌లో కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ తయారీ యూనిట్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. అనంతరం ప్లాంట్ ఆవరణలో ముఖ్యమంత్రి మొక్క నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమరరాజా అద్భుతమైన పరిశ్రమను ఇక్కడ ఏర్పాటు చేసిందని, 1983 లో అమరరాజా చిత్తూరు జిల్లాలో మొదటిసంస్థను ఏర్పాటు చేసిందన్నారు. అమర రాజా సంస్థ ఏర్పాటు చేసి 40 యేళ్లు అవుతోందన్నారు. అమర రాజా గ్లోబల్ సంస్థ.. అంటూ అమర రాజా కు దేశంలో పోటీ లేదన్నారు. చైనా, జపాన్, జర్మని, కొరియా లాంటి దేశాలనుఆదర్శంగా తీసుకుని అమర రాజా సంస్థ పనిచేస్తోందన్నారు. ప్రపంచంలో చైనా ఈవీవెహికిల్స్ కు లీడర్ గా ఉంది.. ఈవీ లో చైనాతో అమర రాజా సంస్థ పోటీ పడిపనిచేస్తోంది.. కాలుష్యం వేగంగా విస్తరిస్తోంది.. వాతావరణంలో మార్పులు వేగంగా వస్తున్నాయి.. ఎలినినో ప్రభావం కారణంగా వర్షాలు పడటం లేదు.. రైతులు ఇబ్బంది పడుతున్నారు.. కోవిడ్ తర్వాత వాతావరణంలోచాలా మార్పులు వచ్చాయని సిఎం అన్నారు. కాలుష్యం తగ్గించుకోవాల్సిన అవసరం ఉంది.. కాలుష్య నియంత్రలోఈవీవెహికిల్స్అవసరం ఉంది.. దివిటిపల్లి అమర రాజా యూనిట్ లో 700 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు..ఇందులో 400 మంది మహిళా ఉద్యోగులు ఉండటంమహిళా సాధికారిత కు నిదర్శనం.. తెలంగాణ రైజింగ్ 2047 లో భాగంగా పాలసీలుతీసుకువస్తున్నాం.. ప్రస్తుతం దేశ జీడీపీలో5 శాతం తెలంగాణ వాటా గా ఉంది.. కాని నేను దీనిపైన సంతోషంగా లేను..

దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచడమే మా లక్ష్యం.. 2034 నాటికి తెలంగాణను వన్ట్రిలియన్డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్నదే మా ధ్యేయం అన్నారు. అమర రాజా లాంటి సంస్థలు తెలంగాణ రైజింగ్ కు మద్దతుగా ఉంటున్నాయి.. తెలంగాణనుక్యూర్, ప్యూర్, రేర్ గా విభజించిపాలసీలు రూపొందించి ముందుకు వెళ్తున్నాం.. తెలంగాణ పరిశ్రమలు పెట్టాలంటే మౌలిక సదుపాయాలు ముఖ్యం.. పారదర్శకంగా విధానాలు రూపొందించుకుని ప్రభుత్వం ముందుకు వెళ్తోంది.. ఢిల్లీకి రాజు అయినా తల్లికి బిడ్డ అన్నట్లు గా నేను పాలమూరుబిడ్డను. ఆదర్శవంతంగా జిల్లా గా మహబూబ్నగర్ ను తీర్చిదిద్దుతున్నాం.. ఒకప్పుడుకరువు జిల్లాగా ఉండే మహబూబ్నగర్ ఇప్పుడు ఇతరజిల్లాలనుదత్తత తీసుకునే స్థాయికి ఎదిగాం.. విద్య లో భాగంగా త్రిబుల్ ఐటీ, ఇంజనీరింగ్ కాలేజీలు,ఏటీసీసెంటర్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ జిల్లాలో ఏర్పాటు చేశాం.. బ్లూ కాలర్ జాబ్ ల కోసం ఏటీసీలు, పాలిటెక్నిక్ లు ఏర్పాటు చేస్తున్నాం.. ఉమ్మడి జిల్లాలోని కల్వకుర్తి, బీమా, ఆర్డీఎస్, నెట్టంపాడు వంటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం.. త్వరలోనే మహబూబ్‌గర్ జిల్లా ప్రజలకుశుభవార్త వినిపిస్తున్నాం. పక్క రాష్ట్రంతో సంప్రదింపులుజరుగుతున్నాయి.. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు 90 టీఎంసీ లు సాధించే దిశగాచర్చలుజరుగుతున్నాయి.. డిండి ప్రాజెక్టుకు 30 టీఎంసీ కేటాయింపుల పై చర్చలుజరుపుతున్నాం.. పరిశ్రమలకు అనుకూల వాతావరణంసృష్టించి జిల్లా లో ఉపాధి అవకాశాలుకల్పిస్తాం.. పాలమూరు జిల్లాలో చాలా మంది రైతులు అమర రాజా కు భూములు ఇచ్చారు.. అత్యధిక ఉద్యోగాలు వాళ్లకుఇవ్వాలని కోరుతున్నట్లు వెల్లడించారు. ఆర్ అండ్ బీ మినిస్టర్ గా గల్లాజయ్ దేవ్ తల్లి గల్లా అరుణ కొడంగల్ లో చాలా రోడ్లు మంజూరు చేశారు.. నేను రెండో సారి గెలవడానికి నాకు అవి ఉపయోగపడ్డాయని రేవంత్ అన్నారు.

# 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

అందిస్తున్నాయి. దేశంలో అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మారబోతున్నాం. పరిశ్రమలు, టూరిజం, క్రీడా నైపుణ్యం, వైద్య రంగాల్లో పాలసీలు తెచ్చాం. హైదరాబాద్‌లోని 3వేల ఆర్టీసీ బస్సులు, 2లక్షల ఆటోలను ఈవీలుగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. ఈవీ వాహనాల రిజిస్ట్రేషన్‌లో జీరో ట్యాక్స్ అమలు చేస్తున్నాం. గొప్ప నగరంగా మారాలనే మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ చేపట్టాం. ఫార్మా పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తీసుకెళ్తున్నాం. హైదరాబాద్‌లో కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాం‘ అని రేవంత్‌రెడ్డి అన్నారు. పన్నెండేళ్ల వ్యవధిలో అమెజాన్ విస్తరణకు రూ.60వేల కోట్ల పెట్టుబడులు పెట్టేలా ఆ సంస్థతో తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే పరస్పర అంగీకారం కుదుర్చుకుంది. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్ విస్తరణ కోసం 202 ఎకరాలు, చందన్‌వెల్లిలో 98 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. రూ.125 కోట్ల విలువ చేసే ప్రోత్సాహకాలు, రాయితీలు అమెజాన్‌కు అందించింది. తొలి విడతలో భాగంగా.. 24 నెలల్లో నిర్మాణ సంబంధిత పనులు పూర్తవుతాయి. అనంతరం రాబోయే 10 ఏళ్లలో మిగతా పనులు పూర్తి చేస్తారు. హైదరాబాద్‌లో క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ, డిజిటల్ బ్యాంకింగ్, ఈ-కామర్స్, ఆరోగ్య సేవలు, ప్రభుత్వ డిజిటల్ సేవలు, స్టార్టప్‌లు, పరిశ్రమలకు అవసరమైన డిజిటల్ మౌలిక వసతులు మరింత బలోపేతం కావడంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. 2047 కల్లా 3 ట్రిలియన్ ఎకానమీకి చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. భారత జీడీపీకి 10శాతం అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కాలుష్యరహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతా మని చెప్పారు. నగరంలో ఉన్న పరిశ్రమలను బయటకు తరలిస్తామన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ చేపట్టామని, డీజిల్ నుంచి ఈవీలుగా బస్సులను మారుస్తామని వెల్లడించారు. ఈవీ వాహనాల రిజిస్ట్రేషన్‌లో జీరో ట్యాక్స్ అమలు చేస్తున్నామని అన్నారు. ఫార్చ్యూన్ కంపెనీలకు హబ్‌గా హైదరాబాద్ మారనుందని, ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన నగరాన్ని నిర్మిస్తున్నామని వెల్లడించారు. పరిశ్రమలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇస్తున్నామని, పారిశ్రామికవేత్తలకు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నామని సీఎం చెప్పుకొచ్చారు. ప్రతి రంగానికి ప్రత్యేక పాలసీలు రూపొందించామని తెలిపారు. పాలసీలపై ఎప్పటికప్పుడు రివ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీకి అమెజాన్ డేటా సెంటర్ స్టెప్పింగ్ స్టోన్‌గా ఉంటుందన్నారు. ఫ్యూచర్ సిటీకి రాబోయే రోజుల్లో మరిన్ని పెట్టుబడులు రానున్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కాగా, ఫ్యూచర్ సిటీలో 202 ఎకరాల్లో అమెజాన్ డేటా సెంటర్ నిర్మాణం జరగనుంది. 12 ఏళ్లలో రూ.60వేల కోట్లను అమెజాన్ వెచ్చించనుంది. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు రామకృష్ణా రావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


# మేడిగడ్డపై కేంద్రం తీరు దారుణం

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చిన నివేదికను బయటపెట్టాలని కెటిఆర్ ఢిల్లీలో మీడియాతో అన్నారు. గత రెండేళ్లలో కేసీఆర్ ఏ ఒక్కరి పేరు పెట్టి విమర్శలు చేయలేదు. రేవంత్‌కు మాత్రం.. కేసీఆర్ పేరు తలవని రోజు లేదు. రెండు రోజులు దిల్లీలోనే ఉన్న సీఎం.. ఎన్డీఎస్ఏ అధికారులను ఎందుకు కలవలేదన్నారు. ఎన్డీఎస్ఏ ప్రాథమిక నివేదికకు.. తుది నివేదికకు చాలా వ్యత్యాసం ఉంది. మేడిగడ్డపై చూపిన శ్రద్ధ.. మిగతా రాష్ట్రాలపై ఎందుకు చూపలేదని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ పనితీరును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. ఎల్‌నినో పరిస్థితుల్లోనూ నీటి సమస్య రాకుండా ఆ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ క్లిష్ట సమయంలోనూ పట్టిసీమ నుంచి నీటిని ఎత్తిపోస్తూ రైతుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేస్తోందని చెప్పారు. ఈ విషయంలో ఆ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత.. తెలంగాణ ప్రభుత్వం ఇవ్వట్లేదన్నారు. సముద్రంలోకి పోయే నీటి వినియోగానికి ఏపీ అన్ని ప్రయత్నాలు చేస్తోందని కేటీఆర్ పేర్కొన్నారు. సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సిసి ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసింది. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి మాజీ మంత్రి జోగురామన్న, ఎంపీ వద్దిరాజు రవిచంద్రతోపాటు సీసీఐ సాధాన సమితి సభ్యులను అందరినీ తీసుకొని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామిని కలిశామని అన్నారు. 1980వ దశకంలో ఏర్పాటు చేయబడ్డ సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ఎ÷-లాంట్ ఒకదశలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 6 వేల మందికి ఉద్యోగాలు కల్పించిందని అన్నారు. రాబోయే 100 సంవత్సరాల వరకు మీకు మైన్ స్టోన్ రిజర్వ్‌లు కూడా మీకు ఉన్నాయి. 4 లక్షల మెట్రిక్ టన్నుల కెపాసిటీతో ఉన్న ఈ ప్లాంట్‌ను నడిపేందుకు అవకాశాలు సంపూర్ణంగా ఉన్నాయన్నారు. గతంలో 2019లో కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా మాటిచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఈ ప్లాంట్‌ను తప్పకుండా తెరిపిస్తామని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చెప్పారు. ఎ÷-లాంట్‌ను తెరిపిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం కూడా మాటిచ్చారు. కానీ ఈ రోజు ఆదిలాబాద్ సీసీఐని తుక్కు కింద అమ్మేస్తున్నరని వారికి వివరంగా చెప్పడం జరిగిందన్నారు.సీసీఐ సాధన సమితి చేస్తున్న పోరాటం అభినందనీయం. మేం కూడా దీన్ని మళ్లీ నడపాలని కోరికతోనే ఉన్నామని కేంద్రమంత్రి అన్నారని కేటీఆర్ వెల్లడించారు. దాదాపు 230 ఎకరాలు అక్కడ ల్యాండ్ ఉన్నది. ఒక 770 ఎకరాలు ప్రైవేట్ పట్టా ల్యాండ్ కంపెనీకి ఉంది. అట్లాగే 1500పై చిలుకు ఎకరాలు లీజ్ ల్యాండ్ ఉంది. మరి 2 వేల కోట్ల రూపాయల పెట్టుబడితో కొత్త ఫ్యాక్టరీతో పెడితే బాగుంటదన్నారు. ఏమైంది ఎందుకు తెరవలేకపోతున్నరని అడిగితే రాష్ట్ర ప్రభుత్వం కొంత స్పందించడం లేదు.. సంవత్సర కాలంగా మేం ప్రయత్నం చేస్తున్నం. కానీ రాష్ట్ర ప్రభుత్వం మైనింగ్ లీజ్ పొడిగించాలి. వాళ్లు ముందుకు రావడం లేదు. మరి రాష్ట ప్రభుత్వం ఏం సబ్సిడీ ఇస్తదా.. ఏమన్నా పెట్టుబడి పెడ్తతా..? జీఎస్టీ మినహాయింపు ఇస్తదా? చెప్పమంటే చెప్పడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది నుంచి పెద్దగా స్పందించడం లేదని కేంద్రమంత్రి చెప్పారని కేటీఆర్ వివరించారు. సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రికి సీసీఐ సాధన సమితి తరపున ధన్యవాదాలుతెలియజేస్తూ.. మేం అధికారంలో ఉన్నప్పుడు సిర్పూర్ పేపర్ మిల్లు తెరిపించాం. అదే ఆదిలాబాద్‌జిల్లాలో మళ్లీ వెంబడ పడి తిరిగి తెరిపించి ఇవాళ వేలాది మందికిఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించినం. సీసీఐని పునరుద్దరిస్తామని ఎన్నికల ప్రచారంలో అమిత్ షా చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని కేంద్రమంత్రి చెప్పారు. సీసీఐని పునరుద్దరిస్తే వేలాదిమందికి ఉద్యోగాలు వస్తాయన్నారు.

# బోనాల జాతరలో హస్తకళా మేళా

## - 16 నుంచి హైదరాబాద్ హెచ్‌ఎండిఎ గ్రౌండ్‌లో ప్రదర్శన




**హైదరాబాద్,జూలై 15 :**ఆషాఢమాస బోనాల మహోత్సవాల సందర్భంగా ఈనెల 16 నుంచి హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ గ్రౌండ్‌లో రాష్ట్రస్థాయి చేతివృత్తి కళాకారుల వస్తు ప్రదర్శన అమ్మకాల మేళా నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ , కమిషనర్ బాల మాయాదేవి తెలిపారు. బోనాల పండుగకు అవసరమైన అన్ని రకాల చేతివృత్తుల ఉత్పత్తులు ఒకే వేదికపై ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ మేళాను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర మంత్రులు భట్టి విక్రమార్క , పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ ,వాకిటి శ్రీహరి , బీసీ సంక్షేమ శాఖ సలహాదారు వి.హెచ్. హనుమంతరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు.గత ఏడాది 30 స్టాల్స్ ఏర్పాటు చేయగా, ఈ ఏడాది 60 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చేతివృత్తులు కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, మేదరి, చేనేత , పూసల తదితర సంప్రదాయ కులవృత్తులకు చెందిన కళాకారులు తమ ఉత్పత్తులను నేరుగా ప్రజలకు విక్రయించే అవకాశాన్ని ఈ మేళా కల్పిస్తుందని ఆమె వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున ఈ మేళాను సందర్శించి సంప్రదాయ చేతివృత్తులను ఆదరించి మేళాను విజయవంతం చేయాలని కోరారు.

# కరీంనగర్ అభివృద్ధికి కృషి చేస్తా...

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. కరీంనగర్ ను మరింతగా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. నగరంలోని 47వ డివిజన్‌లో యూడీఎఫ్ నిధులు రూ.50 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. అనంతరం 62వ డివిజన్ మంకమ్మతోటలో రూ. 98లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు మేయర్ శ్రీనివాస్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధే లక్ష్యంగా భాజపా పని చేస్తోందన్నారు. కరీంనగర్ నగరాన్ని ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉందని.. మరిన్ని నిధులు తీసుకొచ్చి పనులు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు.

# తెలంగాణలో సర్ నమోదు పక్రియ

(మొదటి పేజీ తరువాయి)

అభ్యంతరాల స్వీకరణ, అక్టోబర్ 12న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని ప్రకటించింది. ఈనెల 24 వరకు ఉన్న ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ గడువును ఆగస్టు 3వ తేదీవరకు పొడిగించింది. అనేక జిల్లాలో సర్‌పై అవగాహన లేక మందకోడిగా కొనసాగుతుండగా గడువు సమీపిస్తుండడంతో అనేక రాజకీయ పార్టీల నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణను పొడిగించాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి వినతి పత్రాలు అందించాయి దీంతో స్పందించిన కేంద్ర ఎన్నికల సంఘం ఈ గడువు పొడిగింపును ప్రకటించింది. అర్హత తేదీగా అక్టోబర్ 1వ తేదీ నాటికి ఓటర్ల వివరాల సవరణను పరిగణనలోకి తీసుకుంటూ నూతన షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ నూతన షెడ్యూల్ ప్రకారం బూత్ స్థాయి అధికారులు ఇప్పటికే జూన్ 25 నుంచి ప్రారంభించిన ఇంటింటి సర్వే పక్రియ ఆగస్టు 3 వరకు కొనసాగుతుంది. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ పనులను సైతం అధికారులు ఆగస్టు 3 నాటికి పూర్తి చేస్తారు. ఆ తర్వాత ఆగస్టు 10న రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల ముసాయిదా జాబితా అధికారికంగా విడుదల కానుంది. ముసాయిదా జాబితా విడుదలైన అనంతరం, కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు , తప్పుల మార్పులు-చేర్పులకు సంబంధించిన అభ్యంతరాల స్వీకరణకు ఎన్నికల సంఘం నెల రోజుల పాటు గడువునిచ్చింది. ప్రజలు ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 9 వరకు తమ దరఖాస్తులను సమర్పించే అవకాశం కల్పించారు. ప్రజల నుంచి వచ్చే ఈ అభ్యంతరాలు, క్లెయిమ్‌లకు సంబంధించిన నోటీసుల జారీ, వాటి పూర్తి స్థాయి పరిష్కార పక్రియను అధికారులు ఆగస్టు 10 నుంచి అక్టోబర్ 8 వరకు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ పక్రియ అంతా ముగిసిన తర్వాత అన్ని సవరణలతో కూడిన తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 12న అధికారికంగా ప్రకటించనున్నారు.

# త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

(మొదటి పేజీ తరువాయి)

ఎంపీ రేణుకా చౌదరితో మాట్లాడానని మహేశ్ తెలిపారు. ’తాను మాట్లాడిన ఉద్దేశం వేరని నాతో అన్నారు. ఖమ్మంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండూ కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నాయని అన్నట్లు రేణుక నాతో చెప్పారు.. కానీ ఆ వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేశారు’ అని తెలిపారు. కూనంనేని మిత్రపక్షం అయినప్పటికీ అక్కడ కాంగ్రెస్ క్యాడర్ కూడా ఉందన్నారు. దానిని కాపాడుకునే ప్రయత్నంలో ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడి ఉంటారని చెప్పుకొచ్చారు. కూనంనేనితో తమకెలాంటి విభేదాలూ లేవన్నారు. స్థానిక గా ఉన్న సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకోవాలని చెప్పారు. ప్రతి చిన్న విషయానికి గాంధీభవన్‌కు రావటం మానుకోవాలని క్యాడర్‌కు సూచించారు. నలుగురు ఐదుగురు మినహా అందరు డీసీసీ అధ్యక్షుల పని తీరు బాగుందని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.

# 2028 నాటికి వరంగల్ ఎయిర్‌పోర్టు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. 2011లో రైట్స్ కంపెనీ దేశంలో ఎయిర్ పోర్టుల నిర్మాణాలకు సాధ్యాసాధ్యాలపై చేసిన అధ్యయనంలో వరంగల్, కడప పేర్లు ఉన్నాయి. మోదీ ప్రభుత్వం వచ్చాక ఉడాన్ స్కీంతో ఎయిర్ పోర్టుల పెంపునకు శ్రీకారం చుట్టింది. కొత్తగా 88 ఎయిర్‌పోర్టులకు ఆమోదం తెలిపింది. అందులో వరంగల్ కూడా ఉంది. భూసేకరణ పూర్తికాకపోవడం వల్లే ఎయిర్ పోర్టు నిర్మాణం ఇంత ఆలస్యమైంది. వరంగల్‌కు ఎయిర్‌పోర్టు వస్తోందంటే దానికి కారణం మోదీ. ఆదిలాబాద్‌లో డిఫెన్స్ ఎయిర్‌పోర్టు రాబోతోందని రామచందర్‌రావు చెప్పారు.

# కెసిఆర్‌ది ఫామ్‌హౌజ్ పాలన

(మొదటి పేజీ తరువాయి)

పరిమితమయ్యారని విమర్శించారు. ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేసి పలు రంగాల్లో వైఫల్యాలకు కారణమయ్యారని పొంగులేటి ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లోకి వెళ్లి పాలన అందిస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజల కోసం పనిచేసే నాయకత్వంతోనే సుపరిపాలన సాధ్యమవుతుందని పొంగులేటి పేర్కొన్నారు.

# చల్లని కబురు చెప్పిన వాతావరణ శాఖ

**హైదరాబాద్ ,జూలై 15 :** బలహీనపడిన నైరుతి రుతుపవనాలు మళ్లీ పుంజు కోనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. బంగాళాఖాతంలో మార్పుల వల్ల సముద్రపు గాలులు బలంగా వీస్తూ దట్టమైన మేఘాలు అలుముకోనున్నాయని పేర్కొంది. రెండు, మూడు రోజుల్లో ఇది అల్పపీడనంగా మారి ఒడిశా, బెంగాల్ తీరాల వైపు పయనించి, తూర్పు భారతదేశంలో వర్షాలు కురిపించనుందని వెల్లడించింది. జులై 19 వరకు తెలంగాణలోని ఉత్తర, పశ్చిమ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని, గురువారం జోరందుకుంటాయని అంచనా వేసింది.

# సీతమ్మసాగర్‌కు పర్యావరణ అనుమతులు

**● కేంద్రంతో నిరంతర సంప్రదింపులు ● ఉమ్మడి జిల్లాకు గోదావరి జలాల తరలింపు ● ప్రధాన అంశాలపై మంత్రి ఉత్తమ్‌తో తుమ్మల చర్చ**



**హైదరాబాద్,జూలై 15** అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు వీలైనంత త్వరగా లభించేలా కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సీతారామ ఎత్తిపోతల పథకంతోపాటు సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రధాన సమస్యలను మంత్రి ఉత్తమ్ దృష్టికి తుమ్మల తీసుకెళ్లారు. రేపు మంత్రి ఉత్తమ్ ప్రాజెక్ట్ సందర్శన వెళ్తున్న నేపథ్యంలో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ, పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (ఎంవోఈఎఫ్అండ్‌సీసీ) అనుసరిస్తున్న ప్రామాణిక కార్యా చరణ విధానం (ఎస్‌వోపీ)కు సంబంధించిన అంశం సుప్రీంకోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉండటం తో మార్చి 2023 నుంచి ప్రాజెక్టు పనులు నిలిచిపోయిన సంగతిని గుర్తుచేశారు. ఈ న్యాయ పరమైన చిక్కులు వీలైనంత త్వరగా పరిష్కారమయ్యేలా, పర్యావరణ అనుమతులు మంజూరయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని స్థాయిల్లోనూ కృషి చేస్తోందని వివరించారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644
గురువారం, జూలై 16, 2026



## ఎలక్ట్రికల్ వర్కర్స్ సంఘానికి భవన నిర్మాణ భరోసా



**కరీంనగర్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ సెంట్రల్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు తమ సంఘ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావుకు వినతిపత్రం అందజేశారు.అసోసియేషన్ ప్రతినిధులు ప్రస్తుతం ఆఫీస్ అద్దెలు, ఇతర ఖర్చులను సభ్యుల సొంత డబ్బుతో భరిస్తున్నారని, పెరుగుతున్న భారాన్ని తగ్గించుకోవడానికి సొంతంగా సంఘ భవనాన్ని నిర్మించుకోవాలని నిర్ణయించామని తెలిపారు. సునీల్ రావు మాట్లాడుతూ, కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో కార్మికుల కోసం ప్రత్యేకంగా కార్మిక భవన్ నిర్మించనున్నట్లు వెల్లడించారు. స్థల కేటాయింపు, భవన నిర్మాణం కోసం తాము పూర్తి స్థాయిలో కృషి చేస్తామని, కార్మికుల ఆరోగ్య, భవిష్య నిధి సమస్యల పరిష్కారానికి ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.కార్మికులకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా తమను సంప్రదించవచ్చని, వారి పక్షాన నిలబడి పోరాడతామని ఆయన భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు దువ్వాసి రాజబాబు, కయ్యం పాపయ్య, బషీర్ మహమ్మద్, పింగిలి మహేష్, కయ్యం నాగరాజు, పెండ్యాల అనిల్ రెడ్డి, నాయిని గంగారెడ్డి, వొల్లాల రవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వనమహోత్సవం వేడుకలు



**కరీంనగర్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నగరంలోని 22వ డివిజన్ హిందూపురి కాలనీ సమీపంలో వనమహోత్సవం ఘనంగా జరిగింది. స్థానిక కార్పొరేటర్ బండ రమణ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాలనీవాసులకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేసి, ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద, పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మేయర్ సూచించారు. అనంతరం కాలనీవాసులతో కలిసి స్వయంగా మొక్కలు నాటారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారానే ఆరోగ్యకరమైన సమాజం నిర్మించగలమని, నగరంలో హరితహారాన్ని మరింత విజయవంతం చేయాలని మేయర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో హిందూపురి కాలనీ కమిటీ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, కమిటీ సెక్రటరీ మహేందర్, కాలనీ పెద్దలు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థకు 2000 మొక్కల విరాళం



**కరీంనగర్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వర్షాకాలంలో చేపట్టనున్న మొక్కల నాటే కార్యక్రమానికి తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థకు భారీ మద్దతు లభించింది. కొడిమ్యాల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి స్వచ్ఛందంగా 2,000 మొక్కలను విరాళంగా అందజేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు సర్పంచ్ జీవన్ రెడ్డి, ఉపసర్పంచ్ గుర్రం నర్సయ్యను శాలువాతో సన్మానించారు. సంస్థ వ్యవస్థాపక చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి పూట్కూరితో కలిసి వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, వర్షాకాలాన్ని సద్వినియోగం చేసుకుని మొక్కలు నాటి వాటిని వృక్షాలుగా మారే వరకు సంరక్షించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.అలాగే ఆలయ దర్శన నియమావళి ఫ్లెక్సీల ఏర్పాటు కోసం ఆర్థిక సహాయం అందించిన చిలువేరి శ్రీనివాస్ గౌడను సంస్థ ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు.

## గ్రామపంచాయతీ ఎదుట పెట్రోల్ డబ్బాతో నిరసన



**గన్నేరువరం, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తమ భూమిని ప్రభుత్వ భూమిగా చూపిస్తూ సర్పంచ్, కార్యదర్శి, వార్డు సభ్యులు వేధిస్తున్నారంటూ ఓ కుటుంబం గన్నేరువరం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట పెట్రోల్ డబ్బాతో నిరసనకు దిగింది. తాతల కాలం నాటి 12 గుంటల భూమికి పట్టా పత్రాలు ఉన్నప్పటికీ, అందులో మూడు గుంటల భూమిని వివో భవనానికి ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారని బాధితులు వాపోయారు. అధికారులకు మొరపె ట్టుకున్నా పట్టించుకోకపోవడంతో ఈ ఆందోళనకు దిగినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



**బెజ్జంకి, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం బెజ్జంకి మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.మండల కేంద్రంలో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) భవనాన్ని ప్రారంభించిన ఆయన, రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సహకార వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కొత్త భవనం ద్వారా రైతులకు రుణాలు, సేవలు, సంక్షేమ పథకాలు ఒకే చోట అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.తరువాత ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, వంటగది శుభ్రతను పరిశీలించారు. తగిన సూచనలు చేశారు. అనంతరం బెజ్జంకి, ముత్తన్నపేట గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేసి, నిర్ణీత గడువులో నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు శరత్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, కాంగ్రెస్ నాయకులు, సహకార సంఘ డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ

**హుస్నాబాద్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చిగురుమామిడి మండలంలోని ఉల్లంపల్లి గ్రామంలో కొత్త గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి బుధవారం ఘనంగా భూమిపూజ జరిగింది. గ్రామ ప్రజల చిరకాల ఆకాంక్షగా ఉన్న ఈ భవనం నిర్మాణం గ్రామాభివృద్ధిలో మరో మైలురాయిగా నిలవనుంది.గ్రామ సర్పంచ్ అలువాల శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, ఎంపీడీవో రామ్మోహనచారి, ఎస్ఐ జగదీశ్వర్, ఏపీఎం రజిత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అందే సురేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు గ్రామాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.తిరుపతి రెడ్డి మాట్లాడుతూ కొత్త భవనం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి



వస్తాయని, గ్రామ పరిపాలన సమర్థవంతంగా సాగుతుందని తెలిపారు. ఎస్ఐ జగదీశ్వర్ గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మార్క రాజ్ కుమార్, కార్యదర్శి బోయిని రమేష్, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచ్ కొత్త కైలాసం, సోషల్ యాక్టివిస్ట్ సూదగోని శ్రీనివాస్, ఉపసర్పంచ్ కాణవేని జితేందర్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కాణవేని శివకుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువతతో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.గ్రామ పంచాయతీ తరఫున కార్యక్రమానికి హాజరైన అతిథులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత మరియు గ్రామ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి సీపీఎం

**నల్లగొండ, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన మహాధర్నాకు నల్గొండ నుంచి నాయకులు బయలుదేరారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ హాశం మాట్లాడుతూ, “కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రతి సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చింది. కానీ రెండున్నర సంవత్సరాలు గడిచినా ఆ హామీ అమలు కాలేదు. నిరుద్యోగులు తీవ్ర నిరాశలో ఉన్నారు” అని విమర్శించారు.రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 19,000 పోలీస్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, నిరుద్యోగ భృతి అమలు చేయాలని, అన్ని శాఖల్లో ఖాళీలకు జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగ హామీలు కూడా అమలు కాలేదని విమర్శించారు.“ప్రభుత్వాలు స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం” అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా, పట్టణ, మండల నాయకులు బండ శ్రీశైలం, ఎం.డి. సలీమ్, దండెంపల్లి సత్తయ్య, నలపరాజు సైదులు, మల్లం మహేష్, బొల్లు రవీందర్, ఎం. కిరణ్, కండె యాదగిరి, ఎం.డి. ఆదిల్, రాజేష్, నవదీప్ తదితరులు పాల్గొన్నారు.




# ఓటు హక్కు రక్షణకు ప్రజలే ముందుకు రావాలి

**– ఎస్ఐఆర్ కార్యక్రమంలో ప్రతి అర్హ ఓటరు భాగస్వామ్యం కావాలని కౌన్సిలర్ ఎనుమల్ల రమేష్ పిలుపు**

**ఆమనగల్లు, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడి అత్యంత విలువైన రాజ్యాంగ హక్కని, దానిని పరిరక్షించుకోవడానికి ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రతి అర్హ ఓటరు సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు మున్సిపాలిటీ 8వ వార్డు కౌన్సిలర్ ఎనుమల్ల రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం వార్డులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. కొత్త ఓటరు నమోదు, పేరు సవరణ, చిరునామా మార్పు, అవసరమైతే తొలగింపు వంటి ప్రక్రియలను నిర్ణీత గడువులోపు పూర్తి చేసుకోవాలని కోరారు. సందేహాలు ఉన్నవారు సంబంధిత బూత్ లెవల్ అధికారులను (బీఎల్ఓలు) సంప్రదించి అవసరమైన సేవలను పొందాలని తెలిపారు. ఈ సందర్భంగా




మాజీ కౌన్సిలర్ కమటం రాధమ్మ వెంకటయ్య మాట్లాడుతూ ప్రతి కుటుంబం తమ ఓటు హక్కును కాపాడుకోవడంతో పాటు ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని అన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఎల్ఓలు చంద్రకళ, రాజశేఖర్, మల్లేష్, జ్యోతి, మహబూబమ్మ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# కక్ష రాజకీయాలకు కాంగ్రెస్ నేతలు భయపడరు

**– కోర్టు విచారణకు హాజరైన కాంగ్రెస్ ముఖ్య నాయకులు**

**ఆమనగల్లు, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాజకీయ కక్షసాధింపుతో తమపై నమోదు చేసిన కేసులను న్యాయపరంగా ఎదుర్కొంటామని కాంగ్రెస్ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికార దుర్వినియోగానికి పాల్పడి కాంగ్రెస్ శ్రేణులను వేధించేందుకు తప్పుడు కేసులు నమోదు చేశారని ఆరోపిస్తూ, ఆ కేసు విచారణలో భాగంగా బుధవారం స్థానిక కోర్టుకు కాంగ్రెస్ ముఖ్య నాయకులు హాజరయ్యారు. కోర్టుకు హాజరైన వారిలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుజ్జుల మహేష్, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కాటికే నరేష్, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, యువజన కాంగ్రెస్



నాయకుడు తిరుపతి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో అధికార బలాన్ని ఉపయోగించి కాంగ్రెస్ నాయకులను లక్ష్యంగా చేసుకుని రాజకీయ కక్షసాధింపులో భాగంగానే తప్పుడు కేసులు నమోదు చేయించారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను అణచివేయాలనే ఉద్దేశంతో ఇటువంటి చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. ఎలాంటి ఒత్తిళ్లు, బెదిరింపులు వచ్చినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని, న్యాయవ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు. ఈ కేసుల్లో తాము నిర్దోషులుగా బయటపడతామని ధీమా వ్యక్తం చేశారు. కోర్టుకు హాజరైన కాంగ్రెస్ నాయకులకు లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి గణేష్ గౌడ్ మద్దతుగా పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సంఘీభావం ప్రకటించారు.

# నిరుపేద కుటుంబం నుంచి అంతర్జాతీయ వేదికపై స్వర్ణ పతకం

**దేవరకొండ, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లగొండ జిల్లా డిండి మండలానికి చెందిన యువ అథ్లెట్ నారిమల్ల ప్రవలిక అంతర్జాతీయ అథ్లెటిక్స్ వేదికపై అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించడం దేశానికే గర్వకారణమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు.చైనాలోని ఓర్డోస్ నగరంలో జూలై 9--12 తేదీల్లో జరిగిన తొలి ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2026లో మహిళల 4ఐ400 మీటర్ల రిలేలో ప్రవలిక భారత జట్టుతో కలిసి స్వర్ణ పతకం సాధించారు.ప్రవలిక తండ్రి నారిమల్ల రాంబాబు మేస్త్రీగా, తల్లి విజయ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమించి పట్టుదలతో సాధన చేసిన ప్రవలిక నేడు అంతర్జాతీయ వేదికపై భారతదేశానికి బంగారు పతకం అందించి డిండి గడ్డ కీర్తిని ప్రపంచానికి చాటారు.ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న



సమయంలో ఎమ్మెల్యే బాలు నాయక్ రూ.1 లక్ష సహాయం అందించి అండగా నిలిచారు. “మీరు చేసిన సహాయం నాకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చింది. ఎప్పటికీ మర్చిపోలేను” అని ప్రవలిక భావోద్వేగంతో ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, “పేదరికం ప్రతిభకు అడ్డంకి కాదని ప్రవలిక నిరూపించింది. ఆమె విజయంతో దేశానికి, తెలంగాణకు, నల్లగొండ జిల్లాకు గౌరవం వచ్చింది. భవిష్యత్తులో మరి న్ని పతకాలు సాధించి దేశ కీర్తిని ప్రపంచ వేదికపై మరింతగా చాటాలని కోరుకుంటున్నాను” అని అన్నారు.ప్రవలిక భవిష్యత్తుకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని, త్వరలోనే రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.అలాగే ప్రవలికను అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణిగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన కోచ్ పసుపుల పరశురాంను ప్రత్యేకంగా అభినందించారు.ప్రస్తుతం ప్రవ లిక నల్లగొండ చర్లపల్లిలోని టీజీఎస్ డబ్ల్యూఆర్డిఎస్ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. డిండి గడ్డ నుంచి అంతర్జాతీయ వేదిక వరకు ఎదిగి స్వర్ణ పతకం సాధించిన ప్రవలిక నేటి యువతకు స్ఫూర్తి అని ఎమ్మెల్యే బాలు నాయక్ పేర్కొన్నారు.

RNI - TELTEL/2023/87644
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక



# ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొని ఓటు హక్కును కాపాడుకోండి



– కేంద్ర మంత్రి బండి సంజయ్

**కరీంనగర్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా తప్పనిసరిగా పాల్గొని తమ ఓటు హక్కును కాపాడుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. శనివారం కరీంనగర్ చైతన్యపురిలోని సాధన స్కూల్ బీఎల్ఓ కేంద్రాన్ని సందర్శించిన ఆయన స్వయంగా తన ఎన్యుమరేషన్ దరఖాస్తును పూర్తి చేసి అధికారులకు అందజేశారు. చేతిలో ఓటర్ ఐడీ కార్డు ఉన్నంత మాత్రాన సరిపోదని, ఓటరు జాబితాలో పేరు ఉంటేనే ఓటు హక్కు భద్రంగా ఉంటుందని స్పష్టం చేశారు. జూలై 24తో దరఖాస్తు గడువు ముగుస్తుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ కుటుంబ సభ్యుల ఓట్లను సరిచూసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కొన్ని ప్రాంతాల్లో హిందువుల ఓట్లను తొలగించేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, హిందూ సమాజం అంతా అప్రమత్తమై ఈ ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలని కోరారు.

# రూ.840 కోట్ల నిధులతో నగర సుందరీకరణ పనులు ప్రారంభం



**కరీంనగర్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాబోయే మూడు నెలల్లో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.840 కోట్ల నిధులతో కరీంనగర్ నగర సుందరీకరణ పనులు ప్రారంభించనున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఈ నిధులతో నగరంలో మోడల్ రోడ్లు, స్కైవాక్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలతో పాటు శివారు ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు ఆయన వెల్లడించారు. కరీంనగర్ 47, 62వ డివిజన్లలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావుతో కలిసి రూ.1.48 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. బీజేపీ మేయర్ పీఠం దక్కించుకున్న 100 రోజుల్లోనే రూ.50 కోట్ల యూఐడీఎఫ్ నిధులు తెచ్చి అభివృద్ధి పనులు ప్రారంభించామని, దేశవ్యాప్తంగా కేవలం 17 ప్రాజెక్టులకు మాత్రమే యూసీఎఫ్ నిధులు మంజూరయ్యాయని, అందులో కరీంనగర్ చోటు దక్కించుకోవడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఎంపీగా గెలిచిన నాటి నుండి ఇప్పటివరకు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో రూ.22 వేల కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని, దసరా నాటికి కరీంనగర్-- వరంగల్ హైవే అందుబాటులోకి వస్తుందని బండి సంజయ్ వివరించారు.

# మండల సమస్యలపై పోరాటం అవసరం బోయినిపల్లి ప్రవీణ్ రావు



**కరీంనగర్ రూరల్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూరు గ్రామంలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్, కార్పొరేటర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు హాజరయ్యారు. మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో బీజేపీ ఎల్లప్పుడూ ముందంటుందని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఓటరు నమోదు ప్రక్రియలో బీజేపీ నాయకులు చురుకుగా పాల్గొని ప్రతి బూతులో ప్రజలకు సహకరించాలని సూచించారు. సమావేశంలో స్థానిక సమస్యలపై తీర్మానాలు ఆమోదించబడ్డాయి. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్ కుమార్, దాసరి రమణారెడ్డి, చంద్రశేఖర్, మహేందర్, ఉపసర్పంచులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాంచ జన్యం పథకం ప్రారంభించిన కల్వకుంట్ల కవిత



**పెద్దపల్లి, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పేదల రక్షణ, ఆడబిడ్డల సంక్షేమం, రైతుల అభ్యున్నతి లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పెద్దపల్లిలో పాంచ జన్యం పేరుతో ప్రత్యేక సంక్షేమ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, సామాజిక న్యాయం రంగాల్లో ప్రజలకు పూర్తి సహాయం అందించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని తెలిపారు. పేద పిల్లలు ప్రైవేట్ పాఠశాలలో చదివినా ఖర్చు లేకుండా విద్య అందించడమే కాకుండా, రాష్ట్రంలో ఎక్కడైనా ఉచిత వైద్యం అందించే బాధ్యత తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతే రాజు అనే నినాదాన్ని నిజం చేస్తామని, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో రైతులకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. మొదటి సంవత్సరంలోనే నాలుగు లక్షల ఉద్యోగాలు ఒకే నోటిఫికేషన్ ద్వారా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం జరిగేలా పోరాటం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పెద్దపల్లి జిల్లా టీఆర్ఎస్ ఇన్‌చార్జి సలేంద్ర కొమురయ్య యాదవ్ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు టీఆర్ఎస్‌లో చేరారు. జూలపల్లి, మంథని, రామగుండం, పెద్దపల్లి నియోజకవర్గాలకు చెందిన యువ నాయకులు, ప్రజాప్రతినిధులు కవిత సమక్షంలో పార్టీలో చేరగా, వారికి కండువా కప్పి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో బొంగోని శంకరయ్య గౌడ్, ఉస్థం శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సోనం వాంగ్ చుక్ నిరాహార దీక్షపై కేంద్ర ప్రభుత్వానికి బీఎస్పీ హెచ్చరిక




**హుస్నాబాద్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నీట్ పరీక్ష వైఫల్యాల కారణంగా 18 మంది విద్యార్థుల మరణాలకు బాధ్యత వహించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, ప్రముఖ మానవ హక్కుల నేత, పర్యావరణవేత్త సోనం వాంగ్ చుక్ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద గత 18 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. ఆయన ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో ఎటువంటి అపాయం కలిగినా కేంద్ర బీజేపీ ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని బహుజన సమాజ్ పార్టీ హెచ్చరించింది. మోడీ ప్రభుత్వం అవినీతి, ప్రజాస్వామ్యానికి జవాబు చెప్పకుండా ప్రతిపక్ష గొంతులను అణచివేస్తోందని విమర్శించింది. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయించి, సోనం వాంగ్ చుక్ నిరాహార దీక్షను విరమింపచేయాలని బీఎస్పీ డిమాండ్ చేసింది. పరీక్షల నిర్వహణలో తప్పులు చేసిన వారికి కఠిన శిక్షలు విధించాలని కోరింది. కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే జూలై 20న యువత పార్లమెంట్ ముట్టడికి సిద్ధమవుతోందని బీఎస్పీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్, ఎల గందుల శంకర్, వేల్పుల రాజు, మారిశెట్టి సుధాకర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలు వారి బాగోగులు అనే వినూత్న కార్యక్రమం ప్రారంభం



**సుల్తానాబాద్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆశీస్సులతో 7వ వార్డు కౌన్సిలర్ ఊట్ల వరప్రదీప్ ప్రజల సమస్యలు -- వారి బాగోగులు అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, ఆర్థిక స్థితి, పిల్లల చదువులు, తాగునీటి సరఫరా, సామాజిక భద్రతా పెన్షన్ల అందుబాటు వంటి అంశాలను తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని కౌన్సిలర్ వరప్రదీప్ పేర్కొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు సత్యాగ్రహ దీక్ష



**హైదరాబాద్/సుల్తానాబాద్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద సత్యాగ్రహ దీక్ష జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి మనోజ్ గౌడ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బకాయిలు విడుదల కాకపోవడంతో పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేసి సంక్షేమానికి భరోసా కల్పించాలని కోరారు. దీక్షలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలీస్ క్రీడల్లో సత్తా చాటిన కరీంనగర్ కమిషనరేట్ సిబ్బంది




**కరీంనగర్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడల్లో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన అధికారులు, సిబ్బంది ప్రతిభ కనబరిచి మొత్తం 11 పతకాలు సాధించారు. దీంతో జోన్-3లో అగ్రస్థానాన్ని దక్కించుకున్నారు. కమిషనరేట్ తరఫున పాల్గొన్న క్రీడాకారులు 2 స్వర్ణ, 4 రజత, 5 కాంస్య పతకాలు సాధించి గౌరవాన్ని తీసుకువచ్చారు. ఇతర కమిషనరేట్లలో సిద్ధిపేట 5, రాజన్న సిరిసిల్ల 3, కామారెడ్డి 2, మెదక్ 2 పతకాలు సాధించాయి. ఈ సందర్భంగా కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్, విజేతలను అభినందిస్తూ విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ రాణించడం ప్రతి పోలీసు సిబ్బందికి ఆదర్శమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, నిరంతర సాధనతో ఈ విజయాలు సాధ్యమయ్యాయని కొనియాడారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని కమిషనరేట్‌కు మరింత పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యవంతంగా, ఫిట్‌గా ఉండేందుకు ఇటువంటి క్రీడా పోటీలు ఎంతో దోహదం పడతాయని ఆయన తెలిపారు.

# పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టిన మున్సిపల్ సిబ్బంది



**ఖానాపూర్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మున్సిపాలిటీ ఐదో వార్డులో బుధవారం మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. వర్షాల కారణంగా పెరిగిన మొక్కలు, చెట్లను తొలగించి, డ్రైనేజీలలో పేరుకున్న ఇసుక, మట్టిని శుభ్రం చేశారు. ఈ చర్యలతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. కౌన్సిలర్, మున్సిపల్ సిబ్బంది కలిసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# వనమహోత్సవం వేడుకలలో భాగంగా మొక్కల పంపిణీ



**ఖానాపూర్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండలంలోని రంగపేట గ్రామపంచాయతీ సర్పంచ్ పెట్టం రాధా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వనమహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు మొక్కలను పంపిణీ చేసి, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని వృక్షాలుగా మారే వరకు సంరక్షించాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. అడవులు తగ్గిపోవడం వలన వాతావరణంలో సమతుల్యత కోల్పోయి వర్షాభావం ఏర్పడుతోందని, పరిశుభ్రత పాటించడం ద్వారా వర్షాకాలంలో వ్యాధులను నివారించవచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, జిపిఓ, పంచాయతీ కార్యదర్శి, మహిళా సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అనంతగిరి ముత్యాల పోచమ్మ తల్లి దర్శించుకున్న వెలిచాల రాజేందర్ రావు



**కరీంనగర్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామంలోని ప్రసిద్ధ ముత్యాల పోచమ్మ తల్లి దేవాలయంలో కరీంనగర్ కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు చేసిన ఆయన, కరీంనగర్ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, రైతులకు మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించారు. ఆలయ పూజారులు వేద మంత్రోచ్చారణల మధ్య అర్చనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం రాజేందర్ రావును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, కమిటీ డైరెక్టర్లు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు చేశారు.

# వర్షాలు లేక - విత్తనాలు వేసినవి మొలకెత్తగా ఆందోళనలో రైతన్నలు



**ఖానాపూర్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జూన్, జూలై నెలల్లో సాధారణంగా కుంటలు, చెరువులు నీటితో నిండిపోవాల్సి ఉండగా ఈసారి వర్షాభావం కారణంగా రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. మృగశిర కార్తె ప్రారంభంలో పడిన తక్కువ వర్షాలతో ఆశతో విత్తనాలు వేసిన పంటలు మొలకెత్తినా, వర్షాలు ఆగిపోవడంతో రైతులు ప్రతిరోజూ ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. మొక్కజొన్న, పసుపు, పత్తి, పెసర, బొబ్బెర పంటలు వేసిన రైతులు వర్షం లేక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోర్ల కింద వేసిన వరి నారు నీటి కొరతతో ఎండిపోగా, పోచంపాడ్ ప్రాజెక్టులో నీరు చేరకపోవడంతో సదరమాటు రైతులు పంటలు సాగు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఎల్ నినో ప్రభావం వల్ల వర్షపాతం ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించినా, వర్షాలు కురవక రైతులు అప్పులు ఎలా తీర్చాలో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా ఆరుతడి పంటలకు అనువైన విత్తనాలు పంపిణీ చేసి రైతులను చైతన్యవంతం చేయాలని రైతులు కోరుతున్నారు. గ్రామాల్లో రైతులు మాకు ఆకలి చావులు తప్పవా అనే బాధతో చర్చించుకుంటూ, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఏనుమరేషన్ ఫారాల సమర్పణకు జూలై 24 చివరి తేదీ




**అమ్రాబాద్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రత్యేక సమగ్ర ఓటరు సర్వేలో భాగంగా ఏనుమరేషన్ ఫారాల సమర్పణకు జూలై 24 చివరి తేదీగా నిర్ణయించడంతో, ముస్లిం మైనారిటీ నాయకులు ఓటర్లకు సహాయం చేసేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లకు ఫారాలు నింపడంలో సహకరించి, 2002 ఓటరు జాబితా ఆధారంగా వివరాలు సేకరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ జూలై 24లోపు ఫారాలను పూర్తి చేసి సంబంధిత బూతు స్థాయి అధికారికి సమర్పించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఓటు హక్కు ప్రతి ఒక్కరి హక్కు అని, ఒక్క ఓటు కూడా వదులుకోవద్దని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో అబ్బాస్, అక్రమ్ జానీ, ఖలీమ్, పాషా, అక్రమ్ తదితర ముస్లిం మైనారిటీ నాయకులు పాల్గొని సేవలు అందించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై సహకరించారు.

## రైతులకు సహజ వ్యవసాయం పై అవగాహన సదస్సు



**ఖానాపూర్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సత్తెనపల్లి గ్రామపంచాయతీలో అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్, అరణ్య అగ్రికల్చరల్ ఆల్టర్నేటివ్ ఆధ్వర్యంలో సహజ వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది.ద్రవ జీవామృతం తయారీ, వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శన ఇచ్చి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా 42 మంది రైతులకు ఉచితంగా డ్రమ్ములు పంపిణీ చేశారు.గ్రామ సర్పంచ్ షేర్ల విజయకుమార్, ఉప సర్పంచ్ దామెర శ్రీనివాస్, అలీ మల్లేష్, విడిసి సభ్యులు, రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ద రైతులు ఆసక్తిగా ప్రదర్శనను వీక్షించారు.

## చిన్న కుమ్మరి కుంట పూడికతీతకు రైతుల విజ్ఞప్తి



**హుస్నాబాద్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహమ్మదాపూర్ రోడ్‌లోని సర్వే నెంబర్ 81లో ఉన్న చిన్న కుమ్మరి కుంట పూడికతీత పనులకు అధికారులు అనుమతి ఇవ్వాలని రైతులు విజ్ఞప్తి చేశారు. ఒక ఎకరం 12 గుంటల విస్తీర్ణంలో ఉన్న ఈ కుంట పూర్వకాలం నుంచి చుట్టు పక్కల రైతుల పంట పొలాలకు నీరు అందిస్తూ వస్తోంది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా పూడిక తీయకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి, బావులు, బోర్లలో నీటి సామర్థ్యం తగ్గిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.2023 నుంచి సమస్య పరిష్కారం కోసం అధికారులను సంప్రదించినా చర్యలు తీసుకోలేదని, కుంటలో నీరు నిలవక పంటలు పండించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి పూడికతీత పనులకు అనుమతి ఇచ్చి భూగర్భ జలాలను పెంచేందుకు సహకరించాలని రైతులు కోరుతున్నారు. రాజకీయాలకు తావు లేకుండా రైతుల సంక్షేమం దృష్ట్యా సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## భూముల రీ సర్వే పై అవగాహన సదస్సు




**కమలాపూర్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కమలాపూర్ మండలంలోని మాదన్నపేట గ్రామంలో భూముల రీ సర్వే అవగాహన సదస్సు జరిగింది.ఈ కార్యక్రమానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్, అదనపు కలెక్టర్ ఎన్. రవి, డిప్యూటీ కలెక్టర్ తౌటం రోహిత్ నేత, తహసిల్దార్ సురేష్, గ్రామ సర్పంచ్ రమేష్, మార్కెట్ డైరెక్టర్ యాకోబు పాషా హాజరయ్యారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మానేరు ఇసుకపై బీజేపీ నిరసన



**జమ్మికుంట, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మానేరు ఇసుకను స్థానిక ప్రజలకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం ముందు నిరసన జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి స్పందించకపోవడాన్ని విమర్శిస్తూ, స్థానిక ప్రజలకు ఇసుకను తక్కువ ధరకు అందించాలంటూ వినతిపత్రం సమర్పించారు. తానుగుల, విలాసాగర్ ప్రాంతాల ఇసుకను ఇతర జిల్లాలకు తరలించి, జమ్మికుంట ప్రజలకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు.ఇప్పటికైనా ప్రభుత్వం, ఎమ్మెల్యే, అధికారులు వారంలోగా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున నిరసన దీక్షలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి కైలాసకొటి గణేష్, శీలం శ్రీనివాస్, కొరె రవిందర్, అప్పం మధు, గుర్రం పరుశురాం, అడువాల శ్రీధర్, కేస స్వరూప, ఆకుల తిరుపతి, పోచయ్య, తుర్పాటి శంకర్, ఉడుగుల మహేందర్, సమ్మిరెడ్డి, బొజ్జ శరత్ తదితరులు పాల్గొన్నారు.

## జూలై 25న ఆదివాసి గిరిజన సంఘం మహాసభలు నిర్వహణ



**ఖానాపూర్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం నిర్మల్ జిల్లా రెండో మహాసభలు జూలై 25న నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి తుడసం శంభు తెలిపారు.ఈ మేరకు ఖానాపూర్‌లోని సంఘ కార్యాలయంలో మహాసభల పోస్టర్లు విడుదల చేశారు. ఆదివాసీల హక్కుల రక్షణకై జరిగే ఈ సభకు పటేళ్లు, రైతులు, కార్మికులు, యువత స్వచ్ఛందంగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## విజయవంతంగా ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ



**అమ్రాబాద్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ అమ్రాబాద్ మండలంలో విజయవంతంగా కొనసాగుతోంది. మాచారం గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతి అర్హుడు ఓటు హక్కు పొందాలని నిర్వాహకులు సూచించారు. ఏనుమరేషన్ ఫారాలను నింపడంలో సందేహాలు ఉన్నవారికి అక్కడికక్కడే అవగాహన కల్పించి సహాయం అందించారు. జూలై 24లోపు ఫారాలు సమర్పించాలని ప్రజలకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ కార్యదర్శి మరియు సూపర్‌వైజర్ కోరే రేణయ్య, తాసిల్దార్ కార్యాలయ సహాయకుడు బాలాజీ, బూత్ స్థాయి అధికారి జ్యోతి, కాంగ్రెస్ నాయకులు జాలా రేణయ్య, రామనాథం, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధిలో డీఆర్డీఏ కీలక పాత్ర పోషిస్తుంది

### - కలెక్టర్ చిత్రా మిశ్రా




**కరీంనగర్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రామీణాభివృద్ధి, పేద కుటుంబాల సంక్షేమం, మహిళల ఆర్థిక సాధికారతలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) కీలక పాత్ర పోషిస్తోందని కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. కలెక్టరేట్‌లో డీఆర్డీఏ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆమె, పెన్షన్లు, ఉపాధి హామీ పనులు, ప్లాంటేషన్, స్వచ్ఛ భారత్ మిషన్, బ్యాంకు లింకేజీలు, మహిళా సంఘాల బలోపేతం వంటి అంశాలపై సూచనలు చేశారు.గ్రామాల సమగ్ర అభివృద్ధిలో డీఆర్డీఏను ఆదర్శవంతమైన సంస్థగా తీర్చిదిద్దాలని, పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రధాన ధ్యేయంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు కర్తవ్యనిష్ఠతో పనిచేస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఆమె ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ గీత, అధికారులు పాల్గొన్నారు.

## లైన్ మార్పిడి కారణంగా నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత



**కరీంనగర్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రేకుర్తి సబ్‌స్టేషన్ పరిధిలో పి.ఎం.ఐ పనులు, లైన్ మార్పిడి కారణంగా జూలై 16న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. ప్రభావిత ప్రాంతాలు రేకుర్తి, శాతావాహన కాలనీ, వి పార్క్ వెనుకభాగం, పాతవాడ, కొత్తవాడ, కంటి ఆసుపత్రి ప్రాంతం, ఇందిరమ్మ కాలనీ, స్వామి కాలనీ, శేకాబ్ కాలనీ, సమ్మక్క గద్దెలు. వినియోగదారులు సహకరించాలని ఏడీఈ గడం రఘు కోరారు. అదే విధంగా 11 కె.వి కమాన్ ఫీడర్ లైన్ నిర్వహణ పనుల కారణంగా అదే రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు సాషా మహల్, లక్ష్మీనగర్ చౌరస్తా, కోతిరాంపూర్, గాయత్రి నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. వినియోగదారులు సహకరించాలని ఏడీఈ పీ. శ్రీనివాస్ తెలిపారు.

## విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపు అవసరం కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నాణ్యమైన విద్యాబోధన అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మూడు రోజుల ఇంటిగ్రేటెడ్ ఇన్-సర్వీస్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని సందర్శించిన ఆయన, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ప్రతి విద్యార్థి నిర్దేశిత లెర్నింగ్ అవుట్‌కమ్స్ సాధించేలా బోధన కొనసాగించాలని, ముఖ్యంగా చదవడం, రాయడం, విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కారం, కమ్యూనికేషన్ వంటి 21వ శతాబ్దపు నైపుణ్యాలను పెంపొందించాలన్నారు. అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులకు రిమీడియల్ తరగతులు నిర్వహించి సహాయం అందించాలని సూచించారు. ఏఐ, ఐసీటీ ఆధారిత బోధన పద్ధతులను వినియోగించి లెసన్ ప్లాన్లు, ప్రశ్నాపత్రాల తయారీ, డిజిటల్ క్లాస్‌రూమ్‌ల వినియోగం వంటి అంశాలను ఉపాధ్యాయులు సమర్థవంతంగా అమలు చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, రిసోర్స్ పర్సన్లు, శిక్షణ నిర్వాహకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజాభద్రతకై సీసీ కెమెరాల ఏర్పాటు అవసరం




**పెద్దపల్లి, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొత్తపల్లి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మధుకర్ సూచించారు.గ్రామ సర్పంచ్ పెరిక రిబ్కా సంతోష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చైన్ స్నాచింగ్, దొంగతనాలు, గొడవలు వంటి సంఘటనలను నివారించేందుకు సీసీ కెమెరాలు కీలకమని తెలిపారు. గ్రామ ప్రధాన ప్రవేశ ద్వారం, గుడి, బడి, సెంటర్ ప్రాంతాల్లో కెమెరాలు ఏర్పాటు చేస్తే సంఘటనలను సులభంగా గుర్తించి నేరస్థులను పట్టుకోవచ్చని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో కెమెరాలు ఏర్పాటు చేసి పోలీసులకు సహకరించాలని ఎస్ఐ మధుకర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శిలారపు శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామ ప్రముఖులు, రైతులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శాతవాహన ఇంజనీరింగ్ విద్యార్థులకు తాత్కాలిక వసతి సదుపాయాలు కల్పిస్తాం - కలెక్టర్ కె. హైమావతి




**హుస్నాబాద్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శాతవాహన ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాత్కాలిక వసతి గృహాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. హుస్నాబాద్‌లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల, టిటిసి భవనం, షెడ్యూల్డ్ కులాల బాలికల వసతి గృహాలను పరిశీలించిన ఆమె, కొత్తగా చేరే విద్యార్థులతో పాటు రెండో సంవత్సరం విద్యార్థులకు కూడా తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, భోజనం వంటి సదుపాయాలు అందుబాటులో ఉంచుతామని స్పష్టం చేశారు.బాలుర కోసం టిటిసి భవనం, బాలికల కోసం సోషల్ వెల్ఫేర్ వసతి గృహాలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. శాశ్వత భవనం పూర్తయ్యే వరకు తాత్కాలిక వసతుల్లోనే అన్ని సదుపాయాలు కల్పిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రామ్మూర్తి, తహసీల్దార్, కళాశాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి పెట్టాలి పైడితల్లి



**సుల్తానాబాద్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల సాగుకు సిద్ధం కావాలని మండల వ్యవసాయ అధికారి పైడితల్లి సూచించారు.బోర్లు, బావుల కింద సాగు చేసే రైతులు తక్కువ నీరు అవసరమయ్యే పెసర, మినుము, కంది, జొన్న, సజ్జ వంటి పంటలను ఎంచుకోవడం ద్వారా నీటిని ఆదా చేసుకుంటూ మెరుగైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రైతులు తమ భూముల్లో నీటి వనరులను అంచనా వేసుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని, వ్యవసాయ శాఖ సూచించే శాస్త్రీయ సాగు విధానాలను పాటించాలని సూచించారు.సూక్ష్మ నీటిపారుదల పద్ధతులను వినియోగించడం ద్వారా నీటిని పొదుపుగా ఉపయోగించుకోవచ్చని, సంప్రదాయంగా ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల కంటే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని పైడితల్లి పేర్కొన్నారు.

## ఉత్సవాల్లో భాగంగా దుర్గాభవానీ అమ్మవారికి పుదీనా మాలల అలంకరణ



**కరీంనగర్ రూరల్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆషాడ మాసం శాఖాంబరీ ఉత్సవాల సందర్భంగా నగునూరులోని శ్రీ దుర్గాభవానీ ఆలయంలో అమ్మవారిని పుదీనా మాలలతో అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు పవన కృష్ణ శర్మ విశేష హారతులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఓడిబియ్యం, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మన్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక



**కరీంనగర్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగర బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఎన్నికలు జిల్లా కోశాధికారి వట్టి జగదీశ్ అధ్యక్షతన జరిగాయి. 28 మంది ప్రతినిధులు ఓటు వేసి 12 మంది సభ్యులతో కొత్త కమిటీని ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా అనుముల మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కాల్వ సంపత్, కోశాధికారిగా ముద్దిమడుగుల మల్లేశం ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పాతూరి లింగారెడ్డి, కుడుధుల లక్ష్మల్, సహాయ కార్యదర్శులుగా రాజు, కొమురయ్యలు, కమిటీ సభ్యులుగా సిరికొండ రాజు, తాళ్ల అంజి, ఇల్లందు రవి, కొమురయ్య ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా వట్టి జగదీశ్ మాట్లాడుతూ కొత్త కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు నిధులను ఇన్సూరెన్స్ కంపెనీలకు, సిఎస్సి సంస్థలకు మళ్లించడం తప్పని, పెండింగ్ క్లెయిమ్స్, పెన్షన్లు, స్కాలర్షిప్లు, ఇండ్లు వంటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.జూలై 20న అన్ని జిల్లాల్లో ర్యాలీలు నిర్వహించి కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టి కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.

## బీసీ స్టడీ సర్కిల్ ఉచిత సివిల్స్ శిక్షణ దరఖాస్తులకు ఆహ్వానం

**కరీంనగర్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సివిల్స్--2027 ప్రిలిమ్స్-కమ్-మెయిన్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ తెలిపారు. ఉమ్మడి కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఏబీసీ నిరుద్యోగులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ జూలై 17 నుంచి ఆగస్టు 7 వరకు కొనసాగుతుంది. ఆగస్టు 16న స్క్రీనింగ్ పరీక్ష, 19న ఫలితాలు, 21న ధృవపత్రాల పరిశీలన జరగనుంది. ఎంపికైన 150 మందికి ఆగస్టు 24 నుంచి హైదరాబాద్‌లో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయి.ఎంపికైన వారికి నెలకు రూ.5 వేల స్టైఫండ్, పుస్తకాల కోసం మరో రూ.5 వేల సహాయం అందించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.5 లక్షలు, పట్టణాల్లో రూ.2 లక్షలు లోపు ఉండాలి. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఇంతకు ముందు బీసీ స్టడీ సర్కిల్ శిక్షణ పొందిన వారు అర్హులు కారు. మరిన్ని వివరాలకు 040-24071178, 7780359322 నంబర్లను సంప్రదించవచ్చు.

## మామిడి తోటలో ఉరివేసుకుని మృతి చెందిన గుర్తుతెలియని మృతదేహం గుర్తింపు




**కరీంనగర్ రూరల్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గత నెల 16న ఇరుకుల్ల గ్రామ శివారులోని మామిడి తోటలో ఉరివేసుకుని మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు.తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల మీడియా ద్వారా ప్రచారం చేసిన ఫోటో ఆధారంగా అతను ఒడిశా రాష్ట్రం బర్‌గఢ్ జిల్లా, పైకిమాల్ తహసీల్, జార్జిగడ్ గ్రామానికి చెందిన చూడమణి బొర్హా (51) అని అతని భార్య లలితా బొర్హా, కుమారుడు ధృవీకరించారు.మృతుడు ఇటుక బట్టీలో కూలీ పనికి కరీంనగర్ ప్రాంతానికి వచ్చి, మరణానికి నాలుగు రోజుల ముందు ఇంటికి వస్తానని ఫోన్‌లో చెప్పిన అనంతరం సంప్రదింపులు నిలిచిపోయాయని కుటుంబ సభ్యులు తెలిపారు. అతనికి మద్యపాన అలవాటు, మానసిక సమస్యలు ఉన్నాయని, మరణానికి ఎవరూ బాధ్యులు కారని స్పష్టంచేశారు. పోలీసులు వారి వాంగ్మూలాలను నమోదు చేసి, మృతదేహం పూడ్చిన స్థలాన్ని చూపించారు. ఈ గుర్తింపులో సహకరించిన తెలంగాణ, ఒడిశా మీడియా ప్రతినిధులకు కరీంనగర్ రూరల్ పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు.

## కేంద్ర మంత్రి రాందాస్ అథవాలేను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్పిఐ నాయకులు



**హుస్నాబాద్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హైదరాబాద్ బేగంపేట్‌లోని హరిత ప్లాజాలో జరిగిన ఆర్(ఏ) పార్టీ రాష్ట్రస్థాయి సమావేశానికి కేంద్ర మంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షుడు రాందాస్ అథవాలే హాజరై పార్టీ నిర్మాణంపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా పార్టీ జాతీయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ కొంపల్లి ప్రభుదాస్ ఆధ్వర్యంలో సిద్ధిపేట జిల్లా ఇన్‌చార్జ్ ఆరె కిశోర్, జిల్లా నాయకులు వేల్పుల మహేష్ బాబు, మంద వంశీ, జాల శ్రీనివాస్, హుస్నాబాద్ మండల ఇన్‌చార్జ్ సుంకే రమేష్, నాయకులు ద్యాగాల సతీష్ తదితరులు కేంద్ర మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.సిద్ధిపేట జిల్లాలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా విస్తృత కార్యక్రమాలు చేపట్టి, దళిత, బడుగు, బహుజన వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తామని నాయకులు కేంద్ర మంత్రికి తెలిపారు.

## ర్యాకల్ దేవ్‌పల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



ఎలిగేడు, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):ఎలిగేడు మండలంలోని ర్యాకల్ దేవ్‌పల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు బుధవారం ఘనంగా ప్రారంభ మయ్యాయి. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా, ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సహకారంతో రూ.10 లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్ట బడ్డాయి.గ్రామ సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్, ఉప సర్పంచ్ బొడుగే శివకృష్ణ గౌడ్ కలిసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, "గ్రామ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడమే మా లక్ష్యం. ఎన్నో రోజులుగా ఇరుకు రహదారి సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఇప్పుడు కొత్త సీసీ రోడ్డు ద్వారా సౌకర్యం కలుగుతుంది" అని పేర్కొన్నారు.గ్రామ ప్రజలు ఎమ్మెల్యే విజయరమణారావు సహకారంతో నిధులు మం జూరైనందుకు హర్షం వ్యక్తం చేస్తూ, ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జి. నవీన్, గుడికందుల చంద్రకళ నరేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సాగర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## తెలకపల్లిలో ప్రీ ప్రైమరీ తరగతుల ప్రారంభం



తెలకపల్లి, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): గౌరారం, రావిపాకుల, ఆలేరు, పెద్దపల్లి పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఎంపికైన ఇన్స్ట్రక్టర్లు, ఆయాలు విధుల్లో చేరారు.ఎంఈఓ సి. శ్రీనివాస్ రెడ్డి అవగాహన కల్పించిన అనంతరం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు, సర్పంచులు వారిని ఆహ్వానించారు. గౌరారం రిజ్వానా బేగం, రావిపాకుల శైలజ, ఆలేరు విజయ, పెద్దపల్లి కవిత ఇన్స్ట్రక్టర్లుగా, ఆయాలుగా అనూష, రేష్మ, బాలేశ్వరమ్మ విధుల్లో చేరారు.మొత్తం 106 మంది విద్యార్థులు ప్రీ ప్రైమరీలో ప్రవేశం పొందారని ఎంఈఓ తెలిపారు.

## డిండిచింతపల్లిలో ప్రీ ప్రైమరీ స్కూల్ ప్రారంభం



వంగూరు, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):డిండిచింతపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ స్కూల్‌ను గ్రామ సర్పంచ్ బి. రాంభీష్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బి. కొండల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు చిన్నయ్య పాల్గొన్నారు ఎంఈఓ మాట్లాడుతూ, "అసంపూర్తిగా ఉన్న తరగతి గదులను పూర్తి చేసి, మరమ్మతులు చేసి, పాఠశాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలి" అని సూచించారు. సర్పంచ్ రాంభీష్మ వెంటనే రూ.2 లక్షలతో గదులను పూర్తి చేసి, రంగులు వేయించి, పూల మొక్కలు నాటిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ వినోదమ్మ, గ్రామ కార్యదర్శి ప్రదీప్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్ పాల్గొన్నారు.

## స్వర్ణ పతక విజేత ప్రవళికకు డిండిలో ఘన స్వాగతం




దేవరకొండ, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):చైనాలో జరిగిన ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల 4x400 మీటర్ల రిలేలో భారత జట్టుతో కలిసి స్వర్ణ పతకం సాధించిన డిండి మండల యువ అథ్లెట్ నారిమళ్ల ప్రవళిక స్వగ్రామానికి చేరుకున్న సందర్భంగా ఘన స్వాగతం పలికారు.గ్రామ ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, క్రీడాభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సన్మానించారు. టీపీసీసీ ఎస్సీ విభాగం జనరల్ సెక్రటరీ డాక్టర్ యేకుల రాజారావు మాట్లాడుతూ, "గ్రామీణ ప్రాంతం నుంచి అంతర్జాతీయ వేదికపై జాతీయ పతాకాన్ని ఎగురవేసిన ప్రవళిక విజయం తెలంగాణ యువతకు ఆదర్శం" అని అన్నారు.ప్రవళిక మాట్లాడుతూ, "తల్లిదండ్రులు, కోచ్ పరుశురాం, ఉపాధ్యాయులు, సహచర ఆటగాళ్ల ప్రోత్సాహమే విజయానికి కారణం. భవిష్యత్తులో దేశానికి మరిన్ని పతకాలు సాధించేందుకు కృషి చేస్తాను" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఎఐటియుసి జిల్లా మహాసభలకు కార్మికులు హాజరుకావాలి నాయకుల పిలుపు



కల్వకుర్తి, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో ఆటో డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. "ప్రతి ఆటో కార్మికునికి 12 వేల రూపాయలు ఇవ్వాలన్న కాంగ్రెస్ హామీ నెరవేరలేదు. ఆర్టీవో పోలీసుల వేధింపులు ఆపాలి" అని ఎఐటియుసి మండల అధ్యక్ష కార్యదర్శులు దేశం సైదులు, అమీర్ అన్నారు.జూలై 26న తాడూరు మండల కేంద్రంలో జరగనున్న ఎఐటియుసి జిల్లా 3వ మహాసభలకు పెద్ద ఎత్తున కార్మికులు హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు పులిజాల పరశురాం, నాయకులు రాజేష్, మహేష్, యాదగిరి, అక్బర్, మజీద్, శేఖర్, జనార్దన్, బాలస్వామి, రవీందర్, బాబా తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ న్యాయవాది అల్తాఫ్ హుస్సేన్ మృతికి సంతాపం



కల్వకుర్తి, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):సీనియర్ క్రిమినల్ న్యాయవాది అల్తాఫ్ హుస్సేన్ మృతికి సంతాపంగా కల్వకుర్తి కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాదులు బుధవారం కోర్టు ఆవరణలో రెండు నిమిషాలు మౌనం పాటించారు.న్యాయవాదులు ఆయన వృత్తి ధర్మాన్ని అంకితభావంతో నిర్వర్తించి, నిరుపేదలకు న్యాయం చేయడంలో విశేష సేవలు అందించారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. మల్లేష్, ప్రధాన కార్యదర్శి జమీల్ అహ్మద్, సీనియర్ న్యాయవాదులు వెంకట్ రెడ్డి, వెంకట్ గౌడ్, అమరేందర్, సి. కృష్ణయ్య, వెంకటరమణ, నాగరాజు, జంగయ్య, జయంతి కుమార్, ప్రశాంత్, మల్లేష్ యాదవ్, శ్రీకాంత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఇంటి కలకు చేయూత.. అండగా నిలిచిన అనూష శ్రీశైలం

**- ఉప్పల వెంకటేష్ సహకారంతో ఇద్దరు లబ్ధిదారులకు సిమెంట్ బస్తాల పంపిణీ**



ఆమనగల్లు, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): పేద కుటుంబాల ఇంటి నిర్మాణానికి అవసరమైన సమయంలో చేయూత అందించడం ఎంతో సంతోషంగా ఉందని ఆమనగల్లు మున్సిపాలిటీ 13వ వార్డు కౌన్సిలర్ అనూష శ్రీశైలం అన్నారు. మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సహకారంతో బుధవారం వార్డుకు చెందిన కడమంచి రాముకు 40 సిమెంట్ బస్తాలు, పసుల హరీష్‌కు 30 సిమెంట్ బస్తాలను అంద జేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అనూష శ్రీశైలం మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులతో గృహ నిర్మాణం పూర్తి చేసుకోలేని కుటుం బాలకు ఇలాంటి సహాయం ఎంతో ఉపయోగ పడుతుందని అన్నారు. సేవా దృక్పథంతో ప్రజలకు నిరంతరం అండగా నిలుస్తున్న ఉప్పల వెంకటేష్ సేవలు అభినందనీయమని కొనియాడారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తూనే, సంక్షేమ కార్యక్ర మాలను కూడా కొనసాగిస్తామని తెలిపారు. లబ్ధిదారులు కడమంచి రాము, పసుల హరీష్ మాట్లాడుతూ తమ గృహ నిర్మాణానికి విలువైన సహాయం అందించిన ఉప్పల వెంకటేష్‌కు, వాటిని అందజేసిన కౌన్సిలర్ అనూష శ్రీశైల ంకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## మంత్రి బల్మూర్ వెంకట్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఫరీద్



ఆమనగల్లు, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఎమ్మెల్సీగా కొనసాగుతూ ప్రభుత్వ విప్‌గా, తాజాగా మంత్రి హోదా పొందిన డాక్టర్ బల్మూర్ వెంకట్‌ను ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి యండి ఫరీద్ బుధవారం హైదరాబాద్‌లోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మంత్రి హోదా లభించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజా సంక్షేమం మరియు రాష్ట్ర అభివృద్ధిలో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఎన్‌ఎస్‌య ూఐ నాయకులు సలీం తదితరులు పాల్గొన్నారు.

## ధూళికట్టలో వైభవంగా పోచమ్మ బోనాలు



ఎలిగేడు, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఎలిగేడు మండలంలోని ధూళికట్ట గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో మడేలయ స్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు.గ్రామంలోని 20 కుటుంబాల మహిళలు తలపై బోనాలను ఎత్తుకుని, డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి తరలివెళ్లి, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలను సమర్పించారు. టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.నాయకులు గురువారం మడేలయ స్వామి బోనాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు పూసాల నవీణ్, ఉపాధ్యక్షుడు రాచ కొండ మల్లేశ్, నాయకులు రాజేశం, రాములు, లింగయ్య, శ్రీనివాస్, రాకేశ్, పరుశరాములు, రమేశ్, అనిల్, లచ్చయ్య, కనుకయ్య, శ్రీకాంత్, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవుల హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి



**- డీసీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మకొండ రాజు**

ఆమనగల్లు, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): దళిత క్రైస్తవుల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ, సమాన హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉద్యమించాలని దళిత క్రైస్తవుల హక్కుల పోరాట సమితి (డీసీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మకొండ రాజు పిలుపునిచ్చారు. ఈ నెల 17వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు మహబూబ్‌నగర్‌లోని జేజేఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న దళిత క్రైస్తవుల రాష్ట్రస్థాయి మహా గర్జన సభను విజయవంతం చేయాలని ఆయన బుధవారం ఒక ప్రకటనలో కోరారు. దశాబ్దాలుగా దళిత క్రైస్తవులు రాజ్యాంగం కల్పించిన హక్కులు, సంక్షేమ పథకాల అమలులో వివక్షకు గురవుతున్నారని, వారి సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఐక్య ఉద్యమం అవసరమని అన్నారు. దళిత క్రైస్తవులకు సమాన హక్కులు, రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల అమలు, సామాజిక న్యాయం సాధనే మహా గర్జన సభ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి దళిత క్రైస్తవులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని గుమ్మకొండ రాజు విజ్ఞప్తి చేశారు. ఈ మహాసభ దళిత క్రైస్తవుల హక్కుల సాధనలో కీలక మలుపు కానుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## సమస్యల పరిష్కారం కోరుతూ అద్దె వాహన యజమానుల ర్యాలీ



కల్వకుర్తి, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట బుధవారం అద్దె వాహన యజమానులు తమ కార్లతో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. జిల్లా సంఘం అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ, "డీజిల్, విడిభాగాలు, బీమా, డ్రైవర్ల వేతనాలు అన్నీ పెరిగినా అద్దె మాత్రం పాత రేట్లకే ఉంది. పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడం వల్ల వాహన యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ, "ప్రభుత్వ శాఖల్లో అన్ని కార్యక్రమాల్లో అద్దె వాహనాలే ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. అయినప్పటికీ యజ మానుల సమస్యలను పట్టించుకోవడం లేదు" అని అన్నారు.వాహన యజమానులు "అద్దె రేట్లు పెంచాలి, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి" అంటూ నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని సంఘం నాయకులు స్పష్టం చేశారు.

## సర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి


**- కలెక్టర్**



నల్లగొండ, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ బీఎల్‌ఓలను ఉద్దేశించి, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నాగార్జునసాగర్‌లోని వార్డులను పరిశీలించిన కలెక్టర్, పెండింగ్‌లో ఉన్న మ్యాపింగ్‌ను వెంటనే పూర్తి చేయాలని, ఇంట్లో లేని ఓటర్లను ఫోన్ ద్వారా సంప్రదించి నమోదు చేయాలని సూచించారు. "ఒక్క వ్యక్తికి ఒక్క ఓటు మాత్రమే ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. మరణించిన వారి ఓట్లను ధృవీకరణ పత్రాల ఆధారంగా తొలగించాలి" అని స్పష్టం చేశారు.మున్సిపల్ కమిషనర్ సిహెచ్. సైదులు, తహసిల్దార్ ఖాసీం, మున్సిపల్ చైర్‌పర్సన్ మానస స్వర్ణ సుమన్, అధికారులు, బీఎల్‌వోలు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ఎల్లమ్మ గుడి స్థలం వివాదంపై ఎస్సీ జాతీయ కమిషన్ రెండో నోటీసు

**- ఫ్యూచర్ సిటీ కమిషనర్, రంగారెడ్డి కలెక్టర్‌కు ఐదు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం**


Government of India
National Commission for Scheduled Castes
(A Constitutional body set up under Article 338 of the Constitution of India)
(Jurisdiction: Telangana, Andhra Pradesh, Madhya Pradesh & Chhattisgarh)
906, C.G.O.TOWERS, KAVADIGUDA, HYDERABAD-500080
Tele:(040)27534907,29561965 (Fax):040-29561965
Toll Free No. 1800-1800-345
Email:ncsc.ap@nic.in

File No. APCR/SM/TG/2026/337037
Date : 15/07/2026

Reminder

To,
The Collector & DM, Ranga Reddy District, Telangana, collector_rr@telangana.gov.in
The Commissioner of Police, Future City, Hyderabad, Telangana, cp-futurecity@tspolice.gov.in

Sub: A News article captioned "ఆలయ స్థల ఆక్రమణ ఆపాలి" published in నమస్తే తెలంగాణ has become viral in Social Media

Sir/Madam,

I am directed to refer to this Commission's letter of even number dated 07/07/2026 on the subject mentioned above and to say that no reply in this regard has been received from your office till date.

It is, therefore, requested that the action taken report/proposed to be taken in the matter may kindly be submitted within 5 Days from the date of receipt of this letter for placing the same before the Commission.

Encl:-(As above)

Yours faithfully
Dr.G.Sunil Kumar Babu
DIRECTOR

Copy for information to:-

ఆమనగల్లు, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆమనగల్లు మున్సిపాలిటీ 5వ వార్డు నవచైతన్య కాలనీలోని శ్రీ రేణుక ఎల్లమ్మ గుడి స్థలం వివాదానికి సంబంధించి ఎస్సీ జాతీయ కమిషన్ (భారత ప్రభుత్వం) రెండో నోటీసు జారీ చేసినట్లు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి పరిరక్షణ సమితి ప్రతినిధులు తెలిపారు. గుడి స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నాన్ని వ్యతిరేకించిన 12 మంది దళితులపై అక్రమ కేసులు నమోదు చేశారంటూ పత్రికల్లో ప్రచురితమైన కథనాలు, సోషల్ మీడియాలో వైరల్ అయిన అంశాలపై స్పందించిన కమిషన్ స్వయంగా (సుమోటో) కేసును స్వీకరించినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే జూలై 7న ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఏడు రోజుల్లోగా విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అయితే నిర్ణీత గడువులోగా వివరణ అందకపోవడంతో జూలై 15న రెండో నోటీసు జారీ చేసి, ఐదు రోజుల్లో సమగ్ర విచారణ నివేదికతో పాటు వివరణ సమర్పించాలని ఎస్సీ జాతీయ కమిషన్ ఆదేశించినట్లు వెల్లడించారు. ఈ పరిణామాన్ని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి పరిరక్షణ సమితి స్వాగతిస్తూ, ఆలయ స్థల పరిరక్షణతో పాటు దళిత కుటుంబాలకు న్యాయం జరిగేలా అధికారులు నిష్పాక్షికంగా విచారణ చేపట్టాలని కోరినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

## అల్తాఫ్ హుస్సేన్ సేవలు చిరస్మరణీయం

**- ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండేకార్ యాదిలాల్**



ఆమనగల్లు, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మహబూబ్‌నగర్‌కు చెందిన సీనియర్ న్యాయవాది జనాబ్ అల్తాఫ్ హుస్సేన్ సాహెబ్ మరణం న్యాయ రంగానికి తీరని లోటని ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండేకార్ యాదిలాల్ అన్నారు. బుధవారం ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అల్తాఫ్ హుస్సేన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. గత 50 సంవత్సరాలుగా క్రిమినల్ న్యాయవాదిగా ఆయన న్యాయానికి చేసిన సేవలు, వృత్తిపట్ల చూపిన అంకితభావం, యువ న్యాయవాదులకు అందించిన మార్గదర్శకత్వం ఆదర్శప్రాయమని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో న్యాయవాదులు ముందుకు సాగాలని సూచించారు. భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ లైబ్రరీ సెక్రటరీ గణేష్ గౌడ్, కార్యవర్గ సభ్యులు దేవేందర్ గౌడ్, సర్దార్ నాయక్, సీనియర్ న్యాయవాదులు మల్లేపల్లి జగన్, భాస్కర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, న్యాయవాదులు వస్పుల మల్లేష్, శ్రీశైలం, అజయ్, శ్రీనివాస్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కార్యక్రమాలపై అదనపు కలెక్టర్ సమీక్ష



కొంగర కలాన్, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):రంగారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో బుధవారం అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి వైద్య, ఆరోగ్య శాఖ నిర్వహిస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా తల్లి-శిశు ఆరోగ్య సేవలు, జాతీయ టీకాల కార్యక్రమం, క్షయవ్యాధి నియంత్రణ, మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు, కుటుంబ సంక్షేమం, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ, డీ-వార్మింగ్ డే కార్యక్రమం తదితర అంశాల పురోగతిని ఆమె పరిశీలించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని జ్వరాలపై ప్రత్యేక నిఘా, ఇంటింటి సర్వేలు, ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. "ప్రతి వైద్య సంస్థలో మందులు, పరీక్షా కిట్లు, సిబ్బంది అందుబాటులో ఉండాలి. అర్హులందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలి" అని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డా. స్వర్ణ కుమారి, ఉప జిల్లా అధికారులు, నోడల్ అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్-2026 ఓటరు జాబితా భవిష్యత్తులోనూ కీలకమే - తర్వాత చూద్దాం అనుకుంటే ఇబ్బందులే

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రస్తుతం తెలంగాణలో కొనసాగుతోంది. జులై 24వ తేదీ వరకు ఎన్యూమరేషన్ పత్రాన్ని సంబంధిత బీఎల్?వోలకు ఇవ్వాలని ఎన్నికల సంఘం తెలిపింది. ఎన్యూమరేషన్ పత్రం నింపడంలో అలసత్వం, తర్వాత చూసుకోవచ్చులే అని లైట్ తీసుకుంటే మాత్రం భవిష్యత్తులో అనేక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఎస్ఐఆర్-2026 ఓటర్ల జాబితా రాబోయే రోజుల్లో మరింత కీలకంగా మారనుంది. కొత్త ఓటరుగా నమోదుకు, భవిష్యత్తులో నిర్వహించే ఎస్ఐఆర్‌కు ఈ జాబితానే ప్రాతిపదికగా తీసుకుంటారని అధికారులు చెబుతున్నారు. 2002లో ఎస్ఐఆర్ పేరు లేకుంటే ఇబ్బందులే : ప్రస్తుతం జరుగుతున్న సవరణ ప్రక్రియలో ఎస్ఐఆర్-2002 జాబితాతో వివరాలను లింక్ చేస్తున్నారు. అప్పటి జాబితాలో తమ పేర్లు, తల్లిదండ్రుల పేర్లు లేకపోవడంతో పత్రాలు నింపడంలో పలువురికి ఇక్కట్లు తప్పడం లేదు. ఈ వివరాలు లేకుండా ఎన్యూమరేషన్ ఫారాలను నింపితే తర్వాత కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన గుర్తింపు కార్డుల్లో ఒకటి ఉంటుంది. ఎస్ఐఆర్-2002లో ఈ



కార్యక్రమంపై అప్పట్లో ఓటర్లకు పెద్దగా అవగాహన లేదు. దీంతో చాలా మంది 2002లో ఎస్ఐఆర్ ప్రక్రియకు ప్రాధాన్యం ఇవ్వలేదు. ఇప్పుడు వారి పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. భవిష్యత్తు తరాలు ఓటరు గుర్తింపు కార్డు కోసం అవస్థలు పడకుండా ఉండాలంటే తప్పనిసరిగా ఎస్ఐఆర్-2026లో పేరు ఉండేలా చూసుకోవాలని ఎన్నికల సంఘం అధికారులు సూచిస్తున్నారు. కొత్త ఓటరు నమోదుకు ఎస్ఐఆర్‌తో లింక్ : సాధారణంగా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలంటే ఫారం-6 నింపి ప్రస్తుతం నివసిస్తున్న అడ్రస్, ఏదైనా గుర్తింపు కార్డు ధ్రువపత్రాలను సమర్పించాలి. రాష్ట్రంలో ప్రస్తుతం సర్ ప్రక్రియ కొనసాగుతుండటంతో కొత్త ఓటరు నమోదుకూ ఎస్ఐఆర్‌తో లింక్ పెట్టారు. ఫారం-6 నింపడంతోపాటు ఎస్ఐ ఆర్-2002తో కూడిన వివరాలతో డిక్లరేషన్ పత్రాన్ని సంబంధిత వ్యక్తులు అందించాల్సి ఉంటుంది. ఈ డిక్లరేషన్ పత్రంలో ప్రస్తుతం ఎన్యూమరేషన్ పత్రాన్ని నింపిన విధంగానే తల్లిదండ్రులు, తాత, నానమ్మ పేర్లలో ఒకరి వివరాలను పూరించాల్సి ఉంటుంది. భవిష్యత్తులోనూ కొత్త ఓటర్ల నమోదుకు ఇదే పద్ధతిని అమలుచేసే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. వేరే రాష్ట్రంలోని ఓటర్ల జాబితాలో పేరు నమోదై ఉండి, ప్రస్తుతం తెలంగాణలో ఉద్యోగాలు, వ్యాపారం చేస్తూ నివాసం ఉంటున్నవారు చాలా మంది ఉన్నారు. వేరే రాష్ట్రంలో ఓటర్లుగా ఉండి చిరునామా మార్పులో భాగంగా ఫారం-8 నింపితే దాంతోపాటు ఎస్ఐఆర్ వివరాలతో కూడిన డిక్లరేషన్ ఫారాన్ని కూడా అందించాల్సి ఉంటుంది. అలా చేస్తేనే ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి ఓటు బదిలీ అవుతుందని ఎన్నికల సంఘం అధికారులు చెబుతున్నారు. ఇంకా పది రోజులు మాత్రమే మిగిలి ఉంది : రాష్ట్రంలోని ప్రతి ఒక్కరు ఎన్యూమరేషన్ పత్రాన్ని సమర్పించి ఓటు హక్కును కాపాడుకోవాలని ఓటర్లకు రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీకి ఇంకా కేవలం పది రోజుల గడువు మాత్రమే ఉందని వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నారని, మంగళవారం సాయంత్రం నాటికి 1,66,70,610 (49.28 శాతం) మంది ఓటర్లు తమ ఎన్యూమరేషన్ పత్రాలను తీసుకుని వివరాలను నమోదు చేసి తిరిగి బీఎల్‌వోలకు సమర్పించినట్లు చెప్పారు. రాష్ట్రంలో ు 3,38,21,554(99.99 శాతం) మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ పత్రాలను అందించినట్లు తెలిపారు. ఇంకా ఇప్పటివరకు ఎన్యూమరేషన్? అప్లికేషన్లను బీఎల్?వోలకు అందించనివారు ఉంటే వెంటనే పూర్తి చేసి ఇవ్వాలని సీఈవో సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.

# ఉచిత చేప పిల్లల పథకం పునరుద్ధరించాలి




**పెద్దపల్లి, జూలై 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర ప్రభుత్వం 2026--27 బడ్జెట్‌లో మత్స్యకారుల సంక్షేమాన్ని విస్మరించిందని టీఎంకేఎంకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ విమర్శించారు. జిల్లా కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత 12 సంవత్సరాలుగా అమలవుతున్న ఉచిత చేప, రొయ్య పిల్లల పంపిణీ పథకానికి ఈ ఏడాది నిధులు కేటాయించకపోవడం వల్ల వేలాది మంది మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని, లేకపోతే చేప పిల్లల కొనుగోలుకు నేరుగా మత్స్య సహకార సంఘాల ఖాతాల్లో నిధులు జమ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 20న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల ముందు మహాధర్నాలు చేపడతామని ప్రకటించారు. మత్స్యకారుల జీవిత భద్రత కోసం రూ.20 లక్షల బీమా కల్పించాలని, గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బీమా, ఎక్స్‌గ్రేషియా నిధులను విడుదల చేయాలని కోరారు. జిల్లా నాయకులు మాట్లాడుతూ, పథకాన్ని నిలిపివేయడం మత్స్యకారులకు తీవ్ర అన్యాయం అని, ప్రతి సంఘానికి నగదు బదిలీ చేయాలని, కేరళలో అమలులో ఉన్న విధంగా తెలంగాణలో కూడా రూ.20 లక్షల బీమా అమలు చేయాలని సూచించారు. జూలై 20 ధర్నాలో మత్స్యకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

# ఎన్యూమరేషన్ ఫారాలను నింపి బీఎల్ఓలకు అందించాలి



**భూదాన్ పోచంపల్లి, జూలై 15 :** ఎన్యూమరేషన్ ఫారాన్ని ప్రతి ఓటరు పూరించి పూర్తి వివరాలతో బీఎల్ఓలకు సమర్పించాలని, లేనిచో ఓటు రద్దు అవుతుందని భూదాన్ పోచంపల్లి మండల తాసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం భూదాన్ పోచంపల్లిలో ఆయన మాట్లాడుతూ. మరణించినా, శాశ్వతంగా వేరే ప్రాంతానికి మారినా, పెళ్లిళ్లు అయినా వ్యక్తుల వివరాలు బీఎల్ఓలకు తెలియజేయాలని సూచించారు. ప్రతి అర్హులైన ఓటర్ల వివరాలను ఎలాంటి పొరపాట్లు, నిర్లక్ష్యానికి తావు లేకుండా నమోదు చేసి నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలన్నారు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు వజ్రాయుధమని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలని, బీఎల్ఓలకు అందరూ సహకరించాలని కోరారు.

# మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి హౌస్ అరెస్ట్.. నిర్బంధంలోనే నిరాహార దీక్ష ప్రారంభం!


**బాల్కొండ:** నియోజక వర్గంలో నిలిచిపోయిన ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమం తీవ్ర ఉత్కంఠకు దారితీసింది. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రతిపాదించిన నిరవధిక నిరాహార దీక్షను అడ్డుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం భారీ వ్యూహాన్ని అమలు చేసింది. బుధవారం తెల్లవారుజాము నుంచే నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గ వ్యాప్తంగా వందలాది మంది బీఆర్ఎస్ శ్రేణులను, ముఖ్య నాయకులను పోలీసులు ముందస్తుగా గృహనిర్బంధం చేయడంతో పాటు అర్ధరాత్రి వేళల్లో అరెస్టులు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలోనే వేల్పూర్‌లోని వేముల ప్రశాంత్ రెడ్డి నివాసాన్ని భారీగా పోలీసు బలగాలు ముట్టడించి, ఆయనను ఇల్లు దాటకుండా హౌస్ అరెస్ట్ చేశాయి. భీమ్‌గల్ అభివృద్ధి కోసమే పోరు..భీమ్‌గల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని బీఆర్ఎస్ మండిపడుతోంది.



భీమ్‌గల్‌లో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయడం, ఆర్టీసీ డిపో పునరుద్ధరణ, కూరగాయలు, మాంసం మార్కెట్ నిర్మాణం, సీసీ రోడ్ల పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ దీక్షను ప్లాన్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఈ ప్రాజెక్టులు అత్యధిక శాతం పూర్తయ్యాయని, అయితే ప్రభుత్వం మారిన తర్వాత కాంగ్రెస్ వీటికి నిధులు నిలిపి వేసిందని వేముల ఆరోపించారు. భీమ్‌గల్‌లో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరాన్ని సైతం పోలీసులు అర్ధరాత్రి పూట ధ్వంసం చేయడంపై గులాబీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీక్ష ప్రారంభించడానికి ముందు ప్రశాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పోలీసుల అణచివేత చర్యలతో ప్రజా సమస్యలపై తన పోరాటాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. హౌస్ అరెస్ట్ చేసినప్పటికీ ప్రజల కోసం తన నివాసంలోనే ఒక రోజు దీక్షను కొనసాగిస్తానని భీష్మించారు. ప్రభుత్వం తక్షణమే పెండింగ్ పనుల పూర్తికి నిర్దిష్ట టైమ్‌లైన్ పెట్టాలని డిమాండ్ చేశారు. పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన సీదిరి అప్పలరాజు తనయుడు.. గౌతు శిరీష రియాక్షన్అరెస్టులతో ఆపలేరు: హరీష్ రావుమరోవైపు ఈ పోలీసు చర్యను బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉపనేత టి. హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం శాంతియుత ప్రజాస్వామ్య నిరసనలను సైతం సహించలేకపోతోందని మండిపడ్డారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి.. ప్రతిపక్షాలపై ఇలాంటి అణచివేత చర్యలకు పాల్పడటం దుర్మార్గమన్నారు. తక్షణమే అప్రజాస్వామిక ఆంక్షలను ఉపసం హరించుకోవాలని డిమాండ్ చేశారు.

# కొడంగల్ ఎన్నిక రద్దు చేయాలి రేవంత్ రెడ్డిని జైలుకు పంపాలి

**కొడంగల్ :** కొడంగల్ ఎన్నిక రద్దు చేయాలి. రేవంత్ రెడ్డిని ఏడాది పాటు జైలుకు పంపాలని బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ వెంటనే కేసులు నమోదు చేయాలి. మీనాక్షి నటరాజన్‌కు ఒక న్యాయం, రేవంత్ రెడ్డికి ఒక న్యాయమా..? సాధారణ పౌరులు తప్పు చేస్తే ఒక న్యాయం, అధికారులు, నాయకులు తప్పు చేస్తే వారికి ఒక న్యాయమా..? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రే ఎలక్టోరల్ మాల్ ప్రాక్టీస్ కి పాల్పడ్డారన్నారు. ఎనుముల రేవంత్ రెడ్డి రెండు ఓట్ల కథ. .రేవంత్ రెడ్డికి వంగూరు మండలం సొంత ఊరు కొండారెడ్డి పల్లెలో ఒక ఓటు, కొడంగల్‌లో మరో ఓటు ఉందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. గత ఎన్నికల్లో కుటుంబ సమేతంగా కొడంగల్‌లో ఓటు వేశారు. రెప్రజెంటేషన్ ఆఫ్ పీపుల్స్ యాక్ట్ 1951 ప్రకారం, సెక్షన్ 17 ప్రకారం ఎవరికి రెండు నియోజకవర్గాల్లో ఓటు ఉండకూడదు. సెక్షన్ 18 ప్రకారం వ్యక్తికి ఒకే నియోజకవర్గంలో రెండు ఓట్లు ఉండొద్దు. ఇలాంటి తప్పులు ఎవరైనా చేస్తే సెక్షన్ 31 ప్రకారం విచారణ



జరపాలి. నేరం రుజువైతే ఒక ఏడాది జైలు. జరిమానా లేదా రెండు విధించవచ్చన్నారు. రేవంత్ రెడ్డికి కొడంగల్‌లో, కొండారెడ్డి పల్లిలో రెండు చోట్ల ఓటు ఉంది. ుజూ0274035. ఇదే ఎపిక్ నెంబర్‌తో ఉంది. సీరియల్ నెం 974 కొడంగల్, సీరియల్ నెం 601 కొండారెడ్డి పల్లిముఖ్యమంత్రి హోదాలో వ్యక్తి రెండు ఓట్లు కలిగి ఉన్నారు. రేవంత్ రెడ్డి 31 సెక్షన్ ప్రకారం నేరస్థుడే. ఫాక్ట్ చెక్ అనే సంస్థ ఎలక్షన్ కమిషన్ స్థానంలో వివరణ ఇస్తుంది. అసలు ఫాక్ట్ చెక్ సంస్థ ఎక్కడిది..? ఎందుకు అలా ఎన్నికల కమిషన్ కాకుండా ఫాక్ట్ చెక్ అనే సంస్థ సీఎం ఆఫీస్ నుండి స్పందించింది..?తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆర్టికల్ 324 ప్రకారం, పీపుల్స్ రిప్రెజెంటేషన్ యాక్ట్ ప్రకారం వెంటనే కేసు నమోదు చేయాలి. అయితే ఎన్నికల కమిషన్ కాకుండా, ఫాక్ట్ చెక్ సంస్థ నుండి వివరణ ఇచ్చారు. తర్వాత రాత్రికి రాత్రే ఆ పోస్ట్ డిలీట్ చేశారు. ఫాక్ట్ చెక్ సంస్థపై కేకమిషన్ కాకుండా, ఫాక్ట్ చెక్ సంస్థ నుండి సు నమోదు చేయాలన్నారు. ఓటు తొలిగించాలని రేవంత్ రెడ్డి దరఖాస్తు చేసుకున్నారా..?నిన్న సాయంత్రం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేటలో నాగర్ కర్నూల్ కలెక్టర్ రేవంత్ రెడ్డికి ఎలాంటి ఓటు లేదని చెప్పారు. కానీ ఇప్పటికీ ఓటు ఉంది. 2023లో కొడంగల్‌లో అఫిడవిట్ లో కొడంగల్ ఓటరునే అని చెప్పారు. మరి కొండారెడ్డి పల్లి ఓటు ఏమైంది..? కొండారెడ్డి పల్లెలో ఓటు హక్కు ఎపుడు తొలగించారు..? రేవంత్ రెడ్డి సంతకం చేశారా..? ఓటు తొలగించే ముందు రేవంత్ రెడ్డికి నోటీసు ఇచ్చారా..? ఫారం 8 ప్రకారం, కొండారెడ్డి పల్లిలో ఓటు తొలిగించాలని రేవంత్ రెడ్డి ద చేసుకున్నారా..? ఫారం- 7 ఆధారంగా ఓటు ఎపుడు తొలగించారో జిల్లా కలెక్టర్ సమాధానం చెప్పాలన్నారు. రేవంత్ రెడ్డి ఫారం 7 మీద సంతకం చేయకుండా ఎలా ఓటు తొలగిస్తారు..? లేదంటే.. జిల్లా కలెక్టర్ కూడా బీఎన్ఎస్ ప్రకారం విలువైన ఆధారాన్ని నాశనం చేసిన నేరం కింద నేరస్థులవుతారన్నారు. తెలంగాణలో ఎన్నికల కమీషన్ నడిపేది ఎవరు..? రేవంత్ రెడ్డి.. ? సుదర్శన్ రెడ్డా..? అనే దానిపై సుదర్శన్ రెడ్డి స ా మాధానం చెప్పాలి. సుదర్శన్ రెడ్డి బదులు, సీఎం ఆఫీస్ నుండి ఫాక్ట్ చెక్ ఎందుకు స్పంది ంచింది..? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

# ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది.. ఇలా అయితే మళ్లీ గెలవలేం



**హైదరాబాద్ :** ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ పట్ల తీవ్ర వ్యతిరేకత ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం చాలా కష్టమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎంపీ, ఎమ్మెల్యేలు, కీలక నేతలతో జరిగిన ముఖాముఖిలో మీనాక్షి నటరాజన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పథకాల ప్రభావం ప్రజల్లో లేదని.. ప్రచారంలో వెనుకబడ్డామని అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతేకాదు సోషల్ మీడియాలో కాంగ్రెస్ బలహీనంగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సోషల్ మీడియాపై తీవ్రంగా పోరాడాలని ఎంపీ, ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి, స్థానిక నాయకుల పరస్పర ఫిర్యాదులపై ప్రత్యేకంగా ఆరా తీశారు. చిన్న విషయాలపై గొడవపడితే మళ్లీ గెలవలేమంటూ వివాదాస్పద నేతలు కొండా సురేఖ, కడియం, శివ చరణ్ రెడ్డి తదితరులకు క్లాస్ తీసుకున్నారు. నామినేటెడ్ పోస్టులపై పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, ఎంపీ వేం నరేందర్ రెడ్డిలతో ప్రత్యేక చర్చలు చేస్తామన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ, ఎన్యూమరేషన్‌ను సీరియస్‌గాతీసుకోవాలంటూ మీనాక్షి సూచించారు.


# వరి నాట్లు వేసిన విద్యార్థులు



**ధర్మారం జూలై 15:** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని స్మార్ట్ కిడ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం వ్యవసాయ క్షేత్ర పర్యటన చేశారు. పాఠశాల షెడ్యూల్లో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులను పాఠశాల యజమాన్యం వ్యవసాయ క్షేత్ర పర్యటనకు ధర్మారం శివారులోని పంట పొలానికి తీసుకెళ్లింది. వరి ఎలా పండిస్తారనే విషయాలను సమగ్రంగా పాఠశాల హెడ్‌మాస్టర్ బుధారపు రమాదేవి, కరస్పాండెంట్ బుధారపుమహేందర్ విద్యార్థులకు వివరించారు. సాగు చేయడానికి ముందు రైతులు తాము ఎంచుకున్న విత్తనాలతో వరి నారు పోసి ఎదిగిన అనంతరం కూలీలు నాటు వేస్తారని వారు వివరించారు. నాటు వేసిన తర్వాత ఎరువులు, కలుపు తదితర విషయాలను విద్యార్థులకు వెల్లడించారు. ఆరుగాలం ఎంతో కష్టించి వరి పండించి సమాజానికి ఆహారాన్ని అందిస్తున్న ఘనత రైతులదేనని వారు తెలిపారు. రైతు లేనిదే రాజ్యం లేదని వారే దేశానికి ఆహారాన్ని అందించే వెన్నెముక అని ఈ క్షేత్ర పర్యటనలో విద్యార్థులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వరి నాటు వేసే విధానాన్ని తెలుసుకొని విద్యార్థులు, పాఠశాల మహిళా ఉపాధ్యాయులు ప్రయోగాత్మకంగా వరి నాట్లు వేశారు.

# "మరో వారం రోజులూ వర్షాలు లేనట్లే": తెలంగాణ రైతులకు వాతావరణ శాఖ బ్యాడ్ న్యూస్

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. సాధారణంగా జులై మాసంలో దట్టమైన మేఘాలు, ముసురు పట్టి ఉండాల్సిన వాతావరణం కాస్తా తీవ్రమైన ఎండలతో వేసవి కాలాన్ని తలపిస్తోంది. రాష్ట్రంలో మరో వారం రోజుల వరకు ఎక్కడా ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసే అవకాశాలు కనిపించడం లేదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. నైరుతి రుతుపవనాల ప్రభావం మందగించడంతో పాటు వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల వల్ల వర్షాలు పూర్తిగా ముఖం చాటేశాయి. దీనికి తోడు రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోవడంతో..



కొద్దిరోజులుగా ఇళ్లల్లో పక్కనబెట్టిన ఎయిర్ కూలర్లు, ఏసీలను ప్రజలు మళ్లీ ఆన్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మహబూబ్‌నగర్‌లో భానుడి ప్రతాపం. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సాధారణం కంటే చాలా ఎక్కువగా పగటి ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. మంగళవారం నాటి లెక్కల ప్రకారం.. రాష్ట్రంలోనే అత్యంత గరిష్ఠం గా మహబూబ్‌నగర్ జిల్లాలో ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఇక్కడ సాధారణం కంటే ఏకంగా 6.9 డిగ్రీల సెల్సియస్ అదనంగా పెరిగి 38.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డవడం విశేషం. రాజధాని నగరం హైదరాబాద్‌లో 35.6 డిగ్రీల సెల్సియస్, ఖమ్మం జిల్లాలో 36.4 డిగ్రీల సెల్సియస్ చొప్పున పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉక్కపోత, ఎండల తీవ్రతతో పాటు ఈ నెల 20వ తేదీ వరకు రాష్ట్రంలో బలమైన ఉపరితల గాలులు వీస్తాయని వాతావరణ శాఖ ప్రత్యేకంగా హెచ్చరించింది. రాష్ట్రంలో 28 శాతం వర్షపాతం లోటు!వర్షాలు పడకపోవడంతో రాష్ట్రంలో సాగునీరు, తాగునీటి లెక్కలపై ఆందోళన మొదలైంది. జూన్ 1వ తేదీ నుంచి మంగళవారం నాటికి తెలంగాణ వ్యాప్తంగా సగటున 214.4 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా.. కేవలం 154 మిల్లీ మీటర్ల సాధారణ వర్షపాతం మాత్రమే కురిసింది. దీనివల్ల ప్రస్తుతానికి రాష్ట్రంలో 28 శాతం మేర వర్షపాతం లోటు కొనసాగుతోంది. నదిలో కొట్టుకుపోయిన 3 వేల గ్యాస్ సిలిండర్లు.

# సాయికృష్ణ కేసు.. విచారణను 23కి వాయిదా వేసిన సుప్రీంకోర్టు



**ఢిల్లీ, జులై 15:** గాదె సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో (బుధవారం) విచారణ జరిగింది. ఈ కేసు తదుపరి విచారణను జులై 23వ తేదీకి న్యాయస్థానం వాయిదా వేసింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం ముందు ఈ కేసు విచారణ జరిగింది. ఏపీ ప్రభుత్వం తరఫున దాఖలైన పిటిషన్‌పై స్పందించేందుకు ప్రతివాది, కృష్ణలంక మాజీ సీఐ నాగరాజుకు సుప్రీంకోర్టు వారం రోజుల సమయం ఇచ్చింది. కృష్ణలంక మాజీ సీఐ నాగరాజు పోలీస్ కస్టడీకి సంబంధించి హైకోర్టు విధించిన షరతులను సవాల్ చేస్తూ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సుప్రీంకోర్టును ఆశ్రయించింది.ఏపీ హైకోర్టు తన తీర్పులో నిందితుడి ట్రాన్సిట్ సమయంలో పూర్తి నిడివి వీడియో రికార్డింగ్ చేయాలని, కస్టడీ విచారణలో పలు కఠిన నిబంధనలు పాటించాలని ఆదేశించింది. అయితే ఈ షరతులపై రాష్ట్ర ప్రభుత్వం, సిట్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నిరంతర వీడియో నిఘా కారణంగా దర్యాప్తు గోప్యత దెబ్బతినే అవకాశం ఉందని ఏపీ సర్కార్ తెలిపింది. ఈ కేసు విచారణకు సంబంధించిన కీలక అంశాలు బయటకు వెళ్లే ప్రమాదం ఉందని ప్రభుత్వం తన పిటిషన్‌లో పేర్కొంది. అదేవిధంగా సాయికృష్ణ మృతదేహం అన్వేషణ, సంఘటన స్థల పునర్నిర్మాణం (సీన్ రికన్‌స్ట్రక్షన్) వంటి కీలక దర్యాప్తు చర్యలకు హైకోర్టు విధించిన నిబంధనలు అడ్డంకిగా మారుతున్నాయని సిట్ అధికారులు వాదించారు.

# సచివాలయంలో సీఎం అధ్యక్షతన ఆర్టీజీఎస్ ఉన్నత స్థాయి సమీక్ష




**అమరావతి:**డేటా డ్రివెన్ గవర్నెన్స్‌తో అద్భుత ఫలితాలు సాధించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త పాలనా విధానానికి శ్రీకారం చుట్టింది. నెలవారీ ఆర్థిక నివేదికల ద్వారా వృద్ధిని సమీక్షించు కుంటూ ప్రగతి పథంలో దూసుకుపోవాలని సీఎం చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారు. సుపరిపాలన అందించడంలో అలసత్వాన్ని సహించేది లేదని తేల్చిచెప్పారు. సంక్షే మం, అభివృద్ధిని సమతుల్యం చేస్తూ స్వర్ణాంధ్ర -2047 విజన్ దిశగా రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టేందుకు యంత్రాంగం కదలాలని పిలుపునిచ్చారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఆర్టీజీఎస్ ఉన్నత స్థాయి సమీక్షలో మంత్రులు, కార్యదర్శులకు సీఎం పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. దేశంలోనే తొలిసారిగా ప్రతి నెలా ఆర్థిక నివేదికల విడుదల ద్వారా కేవలం శాఖల పురోగతిని మాత్రమే కాకుండా అధికారులు, ఉద్యోగుల పని తీరును, వారి నైపుణ్యాలను కూడా సమీక్షించనున్నారు. 2019-2024 మధ్య కాలంలో చిన్నాభిన్నమైన వ్యవస్థలను దారిలోకి తెస్తూ గత రెండేళ్లుగా ఉమ్మడి కృషితో పెట్టుబడులకు ఏపీని గమ్యస్థానంగా మార్చామని సీఎం ప్రకటించారు.భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ : ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి వారికి తక్షణ ఉపశమనం కలిగించడమే ధ్యేయంగా పీజీఆర్ఎస్ పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. గత ప్రభుత్వ లోపాల వల్ల రెవెన్యూ శాఖలో అత్యధికంగా భూ వివాదాల అర్జీలు వచ్చాయని వీటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని తెలిపారు. ఇప్పటికే శెట్టిపల్లి, వట్టిచెరుకూరు, కంగుంది, గుటుపల్లి లాంటి సున్నితమైన ప్రాంతాల్లో భూ సమస్యలను విజయవంతంగా పరిష్కరించినట్లు చెప్పారు. రీసర్వే ప్రక్రియ పూర్తి చేసి, రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను ప్రతి నెలా 9న పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఇంకా పంపిణీ చేయాల్సిన 72 లక్షల పుస్తకాలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.36 ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తాం : ఉన్నతాధికారులు కేవలం నాలుగు గోడలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలని చంద్రబాబు తేల్చిచెప్పారు. ప్రజల సమస్యలు, క్షేత్రస్థాయి వాస్తవాలు తెలియాలంటే అధికారులు నేరుగా ప్రజల వద్దకు వెళ్లాల్సిందేనన్నారు. వినూత్న ఆలోచనలతో సుపరిపాలనను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలన్నారు. అవసరమైతే అర్జీల పరిష్కారం కోసం నిబంధనలను, చట్టాలను కూడా సవరించడానికి వెనుకాడవద్దని సూచించారు. కీలక స్థానాల్లో ఉంటూ అభివృద్ధి నిరోధకులుగా పనిచేసే కొందరు అధికారుల తీరును ఆయన తీవ్రంగా తప్పుపడుతూ హెచ్చరికలు జారీ చేశారు.రాష్ట్రంలో ప్రాధాన్యతా క్రమంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోందన్నారు. పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు. అంతకు ముందే ఈ ఏడాది ఆగస్టు 14నుంచే పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి గోదావరి జలాలను విడుదల చేయనున్నట్లు తెలిపారు. సెప్టెంబరు 1న వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభించబోతున్నామని మిగిలిన 36 ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.కరెంట్ బిల్లులు పెంచే ప్రసక్తే లేదు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడో ఏడాదిలోకి అడుగు పెడుతున్నా విద్యుత్ ఛార్జీలు పెంచలేదన్న విషయాన్ని సీఎం గుర్తుచేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఐదేళ్లు కరెంట్ బిల్లులు పెంచే ప్రసక్తే లేదన్నారు. దేశంలోనే తొలిసారిగా ట్రూ డౌన్‌ను అమలు చేస్తున్నామని ప్రకటించారు. పట్టిసీమ నీటితో గోదావరి నుంచి కృష్ణా డెల్టా ఆయకట్టుకు నీరు అందిస్తూనే రాష్ట్రవ్యాప్తంగా జల సంరక్షణ కార్యక్రమాలు సమర్థంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎల్‌నినో వల్ల తలెత్తిన తీవ్ర వర్షాభావ పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పిస్తూ ముందస్తు ప్రణాళికలతో నష్టాలను నివారించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# రాష్ట్రవ్యాప్తంగా 43 లక్షల మంది విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు



**అమరావతి:**విద్యార్థుల ఆరోగ్య కల్పన దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ముఖ్య ంగా విద్యార్థుల్లో పెరుగుతున్న దృష్టి లోపాలను నివారించేందుకు బృహత్తర కార్యక్ర మానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశా లల్లో చదువుతున్న విద్యార్థులందరికీ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటించారు. ఈ మెగా వైద్య శిబిరాల ద్వారా ఏకంగా 43.30 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేయనున్నట్లు ఆయన వెల్లడిం చారు.జూలై 15 నుంచి వైద్య పరీక్షలు : రాష్ట్రవా ్యప్తంగా జూలై 15 నుంచి ఈ ఉచిత కంటి పరీక్షల కార్యక్రమం ప్రారంభం కానుంది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు అనే తేడా లేకుండా అన్ని బడుల్లోనూ ఈ పరీక్షలు నిర్వహిస్తారు. 6 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వయసున్న విద్యార్థులందరినీ వైద్యులు క్షుణ్ణంగా పరీక్షిస్తారు. 'జాతీయ అంధత్వ నివారణ, దృష్టిలోప నియంత్రణ' కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, పాఠశాల విద్యాశాఖ రెండు సంయుక్తంగా సమన్వయం చేసుకుంటూ ఈ శిబిరాలను నిర్వహిస్తాయని మంత్రి సత్యకుమార్ వివరించారు.ఉచితంగా కళ్లద్దాల పంపిణీ : కంటి పరీక్షల అనంతరం దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించిన విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా కళ్లద్దాలు అందజేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.50 లక్షల మంది విద్యార్థులకు ఈ ఉచిత కళ్లద్దాలను పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం సుమారు రూ. 7 కోట్ల వరకు వెచ్చించనుందని మంత్రి తెలిపారు. చిన్న వయసులోనే దృష్టి లోపాలను గుర్తించి, సకాలంలో కళ్లద్దాలు వాడటం వల్ల వారి చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.కేంద్రం ఆమోదంతో పెరిగిన కోటా : నిజానికి గతేడాది కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేవలం 95 వేల ఉచిత కళ్లద్దాల పంపిణీ లక్ష్యాన్ని మాత్రమే నిర్దేశించింది. అయితే రాష్ట్రంలో విద్యార్థుల సంఖ్య, వారి అవసరాలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. ఈ లక్ష్యాన్ని 2.50 లక్షలకు పెంచాలని ప్రతిపాదనలు పంపింది. దీనికి కేంద్రం నుంచి ఆమోదం లభించేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేసింది. రాష్ట్రంలో కంటి అద్దాల పంపిణీ కార్య క్రమం అత్యంత పారద ర్శకంగా, సంతృ ప్తికరంగా సాగుతుండటంతో కేంద్రం వెంటనే సానుకూలంగా స్పందించింది. రాష్ట్రం కోరిన విధంగా అద్దాల పంపిణీ లక్ష్యాన్ని ు కేంద్రం ఆమోదం తెలిపిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు.

# జగన్ రెడ్డిది రాక్షస మనస్తత్వం



**ఎన్టీఆర్ జిల్లా, జులై 15:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాక్షస మనస్తత్వం జగన్‌దని ధ్వజమెత్తారు. కరవు కాటకాలతో రాష్ట్రం అల్లాడిపోవాలనే ఆలోచన ఆయనదని విమర్శించారు. (బుధవారం) పవిత్ర సంగమం వద్ద 11 గంటలకు జలహారతిని సీఎం చంద్రబాబు ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల, మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఈ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడారు.ైతు ద్రోహి జగన్..రైతు ద్రోహి జగన్ అని.. అలాంటి వ్యక్తి ఓ పార్టీ అధ్యక్షుడిగా ఉండే అర్హత కూడా లేదని ఎద్దేవా చేశారు. ఎల్‌నినో కారణంగా ఏపీలో ఎక్కడా ఒక చుక్క నీరు కూడా లేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్, శ్రీశైలం, జూరాల, ప్రాజెక్టుల్లో నీళ్లు లేని పరిస్థితి ఉందని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు ముందుచూపుతోనే ఈరోజు రైతన్నలకు పట్టిసీమ ప్రాణం పోస్తోందని ఉద్ఘాటించారు. కృష్ణా డెల్టాకు, రాయలసీమకు పట్టిసీమతో భద్రత కల్పించారని తెలిపారు. పోలవరం పూర్తి అయ్యేలోపు పట్టిసీమ ద్వారా నీళ్లు పంపిస్తామని చెప్పారు. పట్టిసీమను వట్టిసీమ అని మాట్లాడిన జగన్ కృష్ణానది ఒడ్డుకొచ్చి ఈరోజు ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి నిమ్మల రామానాయుడు డిమాండ్ చేశారు.రూ.1300 కోట్లతో నిర్మించిన పట్టిసీమ నేడు రూ.50 వేల కోట్ల ఆదాయం సృష్టించిందని నిమ్మల తెలిపారు.

# ప్రభుత్వ వైద్యాన్ని ప్రజల తొలి ఎంపికగా తీర్చిదిద్దడమే లక్ష్యం




**విజయవాడ, జులై 15:** ఏపీ ఆయుష్ విభాగంలో రూ.350 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులు సిద్ధంగా ఉన్నాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. (బుధవారం) విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన 'ఔషధ మొక్కలు ఆరోగ్యానికి అసలైన ఆధారం' వన్డే వర్క్ షాప్‌లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఆయుష్ మౌలిక సదుపాయాల విస్తరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. నాలుగు కొత్త ఆయుష్ మెడికల్ కాలేజీల ఏర్పాటు చేశామని. ధర్మవరం, పిఠాపురంలో ఆయుర్వేద కాలేజీలు ఉన్నాయని వెల్లడించారు. ఒక్కో కాలేజీకి ప్రభుత్వం రూ.70 కోట్ల వ్యయాన్ని ఖర్చు చేస్తోందన్నారు. ఆరు ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆస్పత్రులు ప్రారంభం కానున్నాయని తెలిపారు.తిరుపతి, తెనాలి, నందిగామ సహా ఆరు కేంద్రాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని.. ఒక్కో ఆస్పత్రికి రూ.20 కోట్ల నిధులు కేటాయిస్తున్నామని మంత్రి చెప్పారు.1,500కు పైగా ఆయుష్ డిస్పెన్సరీల ఆధునీకరించామన్నారు. ప్రివెంటివ్, వెల్‌నెస్ హెల్త్‌కేర్‌పై ప్రభుత్వ దృష్టి సారించిందన్నారు. 'సంజీవిని' డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫామ్ అమలు చేస్తున్నామని తెలిపారు. నెల రోజుల్లో కేంద్ర ఆయుష్ మంత్రి రాష్ట్రంలో పర్యటించనున్నారని. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ సమక్షంలో ప్రారంభోత్సవాలు జరగనున్నాయన్నారు. అశ్వగంధ, మునగ, ఉసిరి సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తోందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ సేవలు 20 శాతానికి పెరిగాయని, గుంటూరు జీజీహెచ్‌లో 255 ఓపెన్ హార్ట్ సర్జరీలు జరిగాయని మంత్రి వెల్లడించారు. 2026-27కు అదనంగా 325 ఎంబీబీఎస్ సీట్లు ఇవ్వనున్నామన్నారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్నారు.

# కిర్లంపూడిలో ఉద్రిక్తత - ముద్రగడ కుమార్తెను అడ్డుకున్న పద్మనాభం అనుచరులు



**ప్రత్తిపాడు:**మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం(73) అంత్యక్రియలు అధికారిక లాం ఛనాలతో నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యా ణ్‌తో ఫోన్‌లో మాట్లాడి సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎమ్మెల్యేగా నాలు గుసార్లు, లోక్‌సభ సభ్యుడిగా ఒకసారి, కేబినెట్ మంత్రిగా ముద్రగడ పద్మనాభం సేవలందిం చడంతో అధికార లాంఛనాలతో అంతిమ సంస్కారాలు చేపట్టాలని నిర్ణయిం చారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. తన పార్థివదేహాన్ని ఇంటి ఆవరణ లోనే పూడ్చి పెట్టాలని, బతికి ఉన్నప్పుడే ముద్రగడ చెప్పడంతో ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య అంత్యక్రియలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.ముద్రగడ కుమార్తెను అడ్డుకున్న అనుచరులు: ముద్రగడ పద్మనాభం భౌతికకాయానికి నివాళు లర్పించడానికి ఆయన కుమార్తె, జనసేన నాయకురాలు క్రాంతి రావడంతో ఉద్రిక్తత నెలకొంది. ముందుగా ప్రత్తిపాడు వద్ద క్రాంతిని పద్మనాభం అనుచరులు, అభిమానులు అడ్డుకున్నారు. పోలీసులు బందోబస్తు మధ్య క్రాంతి కిర్లంపూడికి వచ్చారు. అయితే ముద్రగడ భౌతికకాయం వద్దకు వెళ్తుండగా మరోసారి ఆయన అనుచరులు క్రాంతిని అడ్డుకున్నారు. క్రాంతి గో బ్యాక్, డోంట్ టచ్ అంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో తీవ్ర వాగ్వాదం నెలకొంది. కన్నతండ్రికి చివరి వీడ్కోలు పలికేందుకు వెళ్లనివ్వరా అంటూ క్రాంతి బోరున విలపించారు. చేసేదేమీ లేక క్రాంతి తీవ్ర మనోవేదనతో దూరం నుంచే తండ్రిని చివరి చూపు చూసి వెళ్లిపోయారు. ముద్రగడ భౌతికకాయానికి ప్రముఖుల నివాళులు: మాజీ మంత్రి, కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం మృతితో ఆయన సొంతూరు కాకినాడ జిల్లా కిర్లంపూడిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కొంతకాలంగా మూత్ర పిండాల సమస్యతో బాధపడుతున్న ముద్రగడ హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. కిర్లంపూడిలో ముద్రగడ భౌతికకాయానికి రాజకీయల ప్రముఖులు నివాళులర్పించారు. ముద్రగడ చివరి చూపు కోసం అభిమానులు, అనుచరులు భారీగా తరలివస్తున్నారు. ముద్రగడ భౌతికకాయానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, భీమిలి ఎమ్మెల్యే గంటాశ్రీనివాసరావు నివాళు లర్పించారు. ముద్రగడ మరణం కాపు సామాజిక వర్గానికి తీరని నష్టమన్నారు. ముద్రగడ పద్మనాభం మృతిపై టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్మ సంతాపం వ్యక్తం చేశారు.

# పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా విద్యుత్ వ్యవస్థ బలోపేతం



**అమరావతి:**వాతావరణ హెచ్చుతగ్గుల వల్ల రాష్ట్రంలో ప్రస్తుతం రోజుకు 280 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించా రు. ప్రభుత్వం ముందుస్తు ప్రణాళికలతో వ్యవహరిస్తూ ఇటువంటి క్లిష్ట పరిస్థితులను సైతం ధీటుగా అధిగమిస్తోందని ఆయన స్పష్టం చేశారు."ట్రూ డౌన్" తగ్గించిన ఏకైక ప్రభుత్వం: గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం సర్వనాశనం చేసిన వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు తన సుదీర్ఘ అనుభవంతో అనతికాలంలోనే గాడిలో పెట్టా రన్నారు. గాలి వేగం కారణంగా అక్కడక్కడా తాత్కాలిక ఇబ్బందులు తలెత్తినా, క్షేత్రస్థాయి సిబ్బంది వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరిస్తున్నారని తెలిపారు. విద్యుత్ రంగంలో శాశ్వత పరిష్కారం కోసం ట్రాన్స్?కో బలోపేతానికి విస్తృత చర్యలు చేప్పట్టామని మంత్రి వివరించారు. ట్రాన్స్?మిషన్ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తూ, భారీగా కొత్త ట్రాన్స్?ఫార్మర్లు, సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. దేశ చరిత్రలో "ట్రూ అప్" ఉంది కానీ, "ట్రూ డౌన్" ద్వారా భారాన్ని తగ్గించిన ఏకైక ప్రభుత్వం తమదేనని గొట్టిపాటి రవికుమార్ అన్నారు.విద్యుత్ ఛార్జీలు పెంచం: గత రెండేళ్లు విద్యుత్ ఛార్జీలు పెంచకుండానే విజయవంతంగా మూడో ఏడాదిలోకి అడుగుపెట్టామన్నారు. రాబోయే రోజుల్లోనూ ఛార్జీలు పెంచబోమని భరోసానిచ్చారు. రాష్ట్రానికి పెద్దఎత్తున వస్తున్న పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని వేగవంతం చేశాన్నారు. ప్రస్తుతం విద్యుత్ శాఖకు సంబంధించి రూ.6 వేల కోట్లు విలువైన వివిధ ప్రాజెక్టు పనులు వేర్వేరు దశల్లో పురోగతిలో ఉన్నాయని తెలిపారు.నిర్ణీత కాలపరిమితిలోగా అవసరం మేరకు అన్ని ప్రాంతాల్లో సబ్?స్టేషన్?ల నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఎక్కడైనా స్థానికంగా ఇబ్బందులు ఉంటే, అక్కడి స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ సమస్యలు పరిష్కరిస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.వరుసగా రెండో ఏడాది ఛార్జీలు తగ్గింపు: మరోవైపు ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు తీపి కబురు చెప్పనుంది. వరుసగా రెండో ఏడాది కూడా విద్యుత్ ఛార్జీలను తగ్గించనుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 940.07 కోట్ల మేర ఛార్జీల తగ్గింపును చేపట్టబోతోంది. విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కామ్‌లు) రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఏపీఈఆర్‌సీ)కి వినతి పత్రాలు దాఖలు చేశాయి. అన్ని విధాలుగా పరిశీలించి ఈ తగ్గింపు కింద వినియోగదారుల బిల్లులను ఎంత తగ్గించాలనే దానిపై కమిషన్ నిర్ణయం తీసుకుంటుంది.2024-25లో డిస్కమ్‌లు రూ.924 కోట్ల మేర ఛార్జీల తగ్గింపును చేపట్టాయి. ఎన్నికల సమయంలో విద్యుత్ వినియోగదారులపై అదనపు ఛార్జీలు విధించబోమని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దానికి అనుగుణంగా అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో విద్యుత్ వినియోగదారులపై అదనపు ఛార్జీలు విధించకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది. ఐదేళ్లలో ట్రూ-అప్, ఇంధన సర్‌ఛార్జ్, విద్యుత్ టారిఫ్ పేరిట వినియోగదారులపై వైఎస్సార్సీపీ ప్రభుత్వం రూ. 32,166 కోట్ల భారాన్ని మోపింది

# మహిళలకు ధైర్యం కోసమే అభయ కార్యక్రమం



**అనకాపల్లి, జులై 15:** సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు చాలా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రజలకు హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. సైబర్ నేరాలపై ఓ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బుధవారం అనకాపల్లి జిల్లాలోని వేంపాడు టోల్ ప్లాజా సమీపంలోని భారతి కన్వెన్షన్‌లో అభయ కార్యక్రమాన్ని హోం మంత్రి అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా అభయ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహిళల భద్రత - మా బాధ్యత అంటూ అనకాపల్లి పోలీసులు మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వివరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఎన్నో పోరాటాలు వలన మహిళలకు స్వేచ్ఛ వచ్చిందని గుర్తు చేశారు. మహిళలకు ధైర్యం కల్పించడానికి.. అభయ కార్యక్రమాన్ని పోలీసులు ప్రారంభించారని తెలిపారు.చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలని మంత్రి అనిత అభిప్రాయపడ్డారు. శక్తి యాప్, శక్తి టీమ్స్ ద్వారా మహిళలకు రక్షణ కల్పిస్తున్నామని చెప్పారు. పిల్లలను తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని అన్నారు. కష్టపడి చదువుకొని, ఉన్నత స్థాయికి వెళ్ళాలని ఈ సందర్భంగా పిల్లలకు ఆమె సూచించారు. ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఎవరైనా మిమ్మల్ని ఇబ్బంది పడితే తక్షణమే 112కి కాల్ చేయాలని అన్నారు. చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయని వివరించారు. బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకండి అంటూ పిల్లలకు హోం మంత్రి అనిత హితవు పలికారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని వారికి స్పష్టం చేశారు.

# తుది దశకు అహ్మదాబాద్ విమాన ప్రమాద దర్యాప్తు



**ఢిల్లీ, జులై 15 :** అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాద దర్యాప్తు తుది దశకు చేరిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. అతి త్వరలోనే ఈ ప్రమాదానికి సంబంధించిన తుది నివేదిక వస్తోందని పేర్కొన్నారు. త్వరగా నివేదిక ఇవ్వడం కంటే.. ప్రమాదం అసలు నిజాన్ని బయటపెట్టడమే తమకు ముఖ్యమని తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు బృందం ఇచ్చిన నివేదికపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. గతేడాది జూన్ 12వ తేదీన అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఎయిర్ ఇండియా ఏఐ-171 బోయింగ్ విమానం కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 229 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బందితో పాటు భూమిపై ఉన్న 19 మంది.. మొత్తం 260 మంది మృతిచెందారు. ఈ ఘటనలో విమాన వ్యవస్థలు, బ్లాక్ బాక్స్ డేటా, ఇంజిన్ భాగాల విశ్లేషణలో ఏఏఐబీ కీలక పురోగతి సాధించింది. పౌర విమానయాన శాఖకు ఐదు ప్రధాన డిమాండ్లతో బాధితుల కుటుంబ సభ్యులు లేఖలు రాశారు. ఫైనల్ రిపోర్ట్ ఇచ్చే ముందు స్వతంత్ర 'ఫుల్ ఫ్లైట్ సిమ్యులేటర్ వాలిడేషన్ టెస్టులు' నిర్వహించాలని డిమాండ్ చేశారు. దర్యాప్తు పురోగతిపై ప్రతి 15 లేదా 30 రోజులకు ఒకసారి కుటుంబాలకు అధికారికంగా సమాచారం అందించాలని అధికారులకు కేంద్రమంత్రి సూచించారు. ఈ కేసు విచారణ బృందంలో బోయింగ్ 787 నడిపిన అనుభవం ఉన్న సీనియర్ కమర్షియల్ పైలట్‌ను చేర్చాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తు చట్టపరమైన హక్కులను కోల్పోయేలా బాధితులపై ఎలాంటి బలవంతపు ఒప్పందాల సంతకాలు చేయించవద్దని అధికారులను కేంద్రమంత్రి ఆదేశించారు. ఈ ఘటనపై తుది నివేదిక విడుదలకు ఓ కచ్చితమైన కాలపరిమితిని ప్రకటించాలని కుటుంబ సభ్యులు కోరారు. బాధితుల కుటుంబ సభ్యుల లేఖపై కేంద్రమంత్రి స్పందించారు. అంతర్జాతీయ దర్యాప్తు నిబంధనల ప్రకారమే విచారణ వేగంగా సాగుతోందని కేంద్రమంత్రి రామ్మోహన్ స్పష్టం చేశారు.


# దేశంలోనే ప్రభుత్వ ఆధ్వర్యంలోని తొలి ఏఐ యూనివర్సిటీ



**కర్ణాటక:** దేశంలో ఏఐ విద్య, టెక్నాలజీ, ఆవిష్కరణలకు సంబంధించి కర్ణాటకను ఒక ప్రముఖ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు 6వ తరగతి నుంచే ఏఐ విద్యను ప్రవేశపెట్టాలని, అలాగే బెంగళూరులో భారతదేశపు మొట్టమొదటి ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తుందని ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ బుధవారం ఎక్స్‌లో తెలిపారు. విద్య, పరిశోధన, డిజిటల్ మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా రాష్ట్రం 'ఏఐ-స్థానిక కర్ణాటక'ను నిర్మించే దిశగా కృషి చేస్తుందని అన్నారు. ప్రతిపాదిత ఏఐ యూనివర్సిటీని బెంగళూరులో స్థాపిస్తామని, ఏఐ, వర్ధమాన సాంకేతికతల్లో నైపుణ్యం కలిగిన నిపుణులను అభివృద్ధి చేయడంపై దృష్టిసారిస్తుందని తెలిపారు. విద్యాసంస్థలు, స్టార్టప్‌లు, పరిశ్రమల మధ్య పరిశోధన, ఆవిష్కరణ, సహకారానికి మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వం ఒక ఏఐ హబ్‌ను కూడా ఏర్పాటు చేయాలని ఆలోచిస్తుందని వెల్లడించారు. ఈ ప్రణాళికలోని ముఖ్యమైన అంశాల్లో ఏఐ విద్యను పరిచయం చేయడం అని శివకుమార్ అన్నారు. ఏఐపై విద్యార్థులకు ప్రాథమిక అవగాహన కల్పించడం, టెక్నాలజీ రంగంలో వారిని సిద్ధం చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు.

# సుప్రీంకోర్టులో విచారణకు అంతరాయం





**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టులో న్యాయ విచారణకు అంతరాయం కలిగించడంతో పాటు భద్రతా సిబ్బందిపై దాడి చేసిన ఇద్దరు న్యాయ విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. (శ్రీఖష ర్బసవత్ం ఖతీతీవర్వస) ఉత్తరప్రదేశ్‌లోని ఎటావా జిల్లాకు చెందిన, లక్నో విశ్వవిద్యాలయంలో మూడో సంవత్సరం న్యాయ విద్యార్థి అయిన 24 ఏళ్ల ప్రబల్ ప్రతాప్ సింగ్, రాయ్‌బరేలికి చెందిన రెండవ సంవత్సరం న్యాయ విద్యార్థి 23 ఏళ్ల చందర్ భాన్ కలిసి జూలై 10న సుప్రీంకోర్టులో హంగామా చేశారు. ప్రబల్ ప్రతాప్ సింగ్ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానంలో విచారణ జరుగుతుండగా కోర్టు కార్యకలాపాలకు అంతరాయం కలిగించారు. కాగా, పిటిషనర్ అయిన ప్రబల్ ప్రతాప్ స్వయంగా కోర్టుకు హాజరై గందరగోళం సృష్టించాడు. న్యాయమూర్తులను దుర్భాషలాడటంతో పాటు కోర్టు హాలులో కాగితాలు విసిరేశాడు. అదుపు చేసేందుకు జోక్యం చేసుకున్న భద్రతా సిబ్బందిపై న్యాయ విద్యార్థులు దాడి చేసి వారి విధులను అడ్డుకున్నారు. మరోవైపు సుప్రీంకోర్టు భద్రతా సిబ్బంది ఫిర్యాదుపై ఢిల్లీ పోలీసులు స్పందించారు. ఇద్దరు న్యాయ విద్యార్థులను అరెస్ట్ చేశారు. వారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితుల ప్రవర్తనపై సుప్రీంకోర్టు సూచనల మేరకు వైద్య పరీక్షల కోసం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ బిహేవియర్ అండ్ అలైడ్ సైన్సెస్‌కు తీసుకువెళ్లారు. అయితే ఇద్దరు న్యాయ విద్యార్థుల మానసిక ఆరోగ్యం బాగానే ఉన్నట్లుగా వైద్యులు నిర్ధారించారని పోలీస్ అధికారి తెలిపారు. దీంతో నిందితులిద్దరినీ రెండు రోజుల పోలీస్ కస్టడీకి తరలించినట్లు చెప్పారు. వారి వద్ద ఉన్న అభ్యంతరకర విషయాల కరపత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

# మోదీ ప్రభుత్వం కారణంగా దేశం ఆర్థిక సంక్షోభం వైపు పయనిస్తోంది




**న్యూ ఢిల్లీ :** మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా దేశం క్రమంగా ఆర్థిక సంక్షోభం దిశగా పయనిస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. జూన్ నెలలో టోకు ధరల ద్రవ్యోల్బణం 9.87 శాతానికి పెరగడంతో ఈ మేరకు విమర్శించింది. పెరుగుతున్న ద్రవ్యోల్బణంపై ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ ఆర్థిక వైఫల్యానికి ఆయనే బాధ్యత వహించాలని పేర్కొంది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. గత 44 నెలల్లోనే టోకు ద్రవ్యోల్బణం అత్యధిక స్థాయికి చేరిందని జైరాం రమేశ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇంధనం, విద్యుత్ ధరలు 27.4 శాతం పెరగడం వల్ల రవాణా, ఉత్పత్తి వ్యయాలు భారీగా పెరిగాయని తెలిపారు. మరోవైపు దేశంలో పంటల సాగు విస్తీర్ణం మూడేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయిందని పేర్కొంటూ, వ్యవసాయ రంగం కూడా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోందని అన్నారు. ప్రజలు, రైతులపై రెట్టింపు భారం పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం కారణంగా సామాన్య ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జైరాం రమేశ్ అన్నారు. రైతులు కూడా ప్రభుత్వ లోపభూయిష్ట విధానాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా రెట్టింపు కష్టాలను అనుభవిస్తున్నారని విమర్శించారు. వ్యవసాయ వ్యయాలు పెరగడంతో పాటు దిగుబడులపై కూడా ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం పెరగడం వల్ల పరిశ్రమల నిర్వహణ వ్యయం కూడా అధికమై, దాని ప్రభావం చివరకు వినియోగదారులపై పడుతోందని ఆయన తెలిపారు. 'రెడ్ అలర్ట్'లో ఆర్థిక సూచీలు దేశంలోని కీలక ఆర్థిక సూచీలన్నీ 'రెడ్? అలర్ట్' సూచిస్తుండగా, వాటిని సరిదిద్దేందుకు ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదని కాంగ్రెస్ ఆరోపించింది. పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేయకుండా ప్రజల దృష్టిని ఇతర అంశాల వైపు మళ్లించే ప్రయత్నంలో ప్రభుత్వం నిమగ్నమైందని జైరాం రమేశ్ విమర్శించారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడంపై దృష్టి పెట్టకుండా, పెరుగుతున్న ధరల గణాంకాలను దాచిపెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. టోకు ద్రవ్యోల్బణం తాజా గణాంకాలు కేంద్ర ప్రభుత్వ ఆర్థిక నిర్వహణలోని వైఫల్యాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయని కాంగ్రెస్ పేర్కొంది. సమాజంలోని అన్ని వర్గాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ప్రభుత్వ ప్రాధాన్యతలు ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించింది. "మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల దేశం ఆర్థిక సంక్షోభం వైపు అడుగులు వేస్తోంది. గత కొన్ని నెలలుగా కాంగ్రెస్ పార్టీ ఈ విషయంపై కేంద్రాన్ని హెచ్చరిస్తూనే ఉంది. అయినప్పటికీ ప్రభుత్వం పరిస్థితిని సరిచేసే చర్యలు తీసుకోవడం లేదు. ద్రవ్యోల్బణం విషయంలో దేశ ప్రజలకు ప్రధాని సమాధానం చెప్పాలి. దాదాపు 12 ఏళ్లుగా అధికారంలో ఉన్న ప్రభుత్వం ఈ పరిస్థితికి బాధ్యత వహించాల్సిందే."- జైరాం రమేశ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదరి జూన్‌లో పెరిగిన టోకు ద్రవ్యోల్బణం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, మే నెలలో 9.68 శాతంగా ఉన్న టోకు ధరల ద్రవ్యోల్బణం జూన్‌లో 9.87 శాతానికి పెరిగింది. ఆహార ఉత్పత్తులు, ఆహారేతర వస్తువుల ధరలు పెరగడం ఇందుకు ప్రధాన కారణంగా పేర్కొన్నారు. 2022-23ను ఆధార సంవత్సరంగా తీసుకుని ఈ గణాంకాలను విడుదల చేశారు. 'ఎల్ నినో' ప్రభావంతో వర్షపాతం తగ్గడం, ఆహార పదార్థాల ఉత్పత్తిపై ప్రభావం పడడం వల్ల ఆహార ద్రవ్యోల్బణం కూడా పెరిగింది. మే నెలలో 3.60 శాతంగా ఉన్న ఆహార ద్రవ్యోల్బణం జూన్‌లో 5.49 శాతానికి చేరింది. ఇదే సమయంలో ఆహారేతర వస్తువుల టోకు ద్రవ్యోల్బణం 11.07 శాతంగా నమోదైంది. ఈ విషయంపై కేంద్రాన్ని హెచ్చరిస్తూనే ఉంది. ఖనిజాల విభాగంలో ఇది 9.45 శాతంగా ఉంది. ఇంధనం, తయారీ రంగంలో పరిస్థితి ఇంధనం, విద్యుత్ విభాగంలో టోకు ద్రవ్యోల్బణం మే నెలలో 30.33 శాతంగా ఉండగా, జూన్‌లో 27.41 శాతానికి తగ్గింది. అయితే ఇది ఇప్పటికీ అధిక స్థాయిలోనే ఉందని నిపుణులు చెబుతున్నారు. తయారీ ఉత్పత్తుల టోకు ద్రవ్యోల్బణం మాత్రం మే నెల 7.48 శాతం వద్ద స్థిరంగా కొనసాగింది.

# రష్యా చమురుపై అమెరికా టారిఫ్ బిల్లు- కేంద్రాన్ని నిలదీసిన కాంగ్రెస్



**న్యూ ఢిల్లీ :** రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై అమెరికాలో ప్రతిపాదిత టారిఫ్ బిల్లు రాజకీయంగా చర్చనీయాంశమైంది. ముఖ్యంగా భారత్‌పై 100 శాతం వరకు సుంకాలు విధించే అవకాశాన్ని కల్పించే బిల్లు అమెరికా సెనేట్‌లో ప్రవేశపెట్టడంతో కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ అంశంపై కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది. అమెరికాలో రిపబ్లికన్, డెమొక్రాట్ పార్టీలకు చెందిన సెనేటర్లు కలిసి రూపొందించిన ఆ బిల్లు రష్యాపై ఆర్థిక ఒత్తిడి పెంచడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో మాస్కోకు ఆర్థిక వనరులు అందకుండా చేయాలనే ఉద్దేశంతో ఈ ప్రతిపాదనను తీసుకొచ్చారు. రష్యా నుంచి పెద్దఎత్తున చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై టారిఫ్‌లు విధించే అధికారం అమెరికా అధ్యక్షుడికి కల్పించేలా బిల్లును రూపొందించారు. ఆ బిల్లుపై ఢిల్లీలో కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం చైర్మన్ పవన్ ఖేరా తీవ్రంగా స్పందించారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందాలపై వార్తలను ఖండించడంలో ముందుండే కేంద్ర మంత్రి పీయూశ్ గోయల్ ఇప్పుడు ఈ అంశంపై స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. అమెరికా హౌస్‌లోని డెమొక్రాట్లు మాత్రమే కాకుండా, ట్రంప్‌నకు మద్దతుగా ఉన్న రిపబ్లికన్ సెనేటర్లు కూడా ఈ బిల్లును సమర్థిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో పవన్ ఖేరా చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "రష్యా చమురు కొనుగోలు చేయడానికి ట్రంప్ అనుమతి అవసరమైన పరిస్థితి వచ్చిందా? ఇప్పుడు అదే కారణంతో భారత్‌పై శిక్షాత్మక టారిఫ్‌లు విధిస్తామని హెచ్చరించవేదిక ఎక్స్‌లో పవన్ ఖేరా చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా దండ అవమానకరం" అని ఆయన పేర్కొన్నారు. భారత విదేశాంగ విధానం, ఇంధన విధానం స్వతంత్రంగా ఉండాలని, దేశ ప్రయోజనాలే ప్రధానంగా ఉండాలని కాంగ్రెస్ అభిప్రాయపడుతోంది.

# సర్‌లో పాల్గొన్న సిబ్బందికి 6 వేల గౌరవ వేతనం



**న్యూఢిల్లీ:** కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ. కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. పంజాబ్, హర్యానా, చండీఘడ్‌తో పాటు అనేక రాష్ట్రాల్లో సర్ ప్రక్రియ జరుగుతోంది. అయితే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ వివరాలు సేకరిస్తున్న బూత్ లెవల్ ఆఫీసర్లు(బీఎల్వోలు), బూత్ లెవల్ సూపర్‌వైజర్లు(బీఎల్ఎస్)కు గౌరవ వేతనంగా 6 వేలు ఇవ్వాలని కేంద్రం ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. మంగవారం రాత్రి ఆ ఆదేశాలు ఇచ్చారు. ప్రస్తుతం తెలంగాణలోనూ సర్ ప్రక్రియ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. తమ విధులకు ఇచ్చే జీతంతో పాటు ఒక్కసారి మాత్రమే అదనంగా 6వేల గౌరవ వేతనాన్ని ఇవ్వనున్నట్లు ఈసీ పేర్కొన్నది. ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, దాద్రా నగర్ హవేలీ, డామన్ డయ్యూ, జార్ఖండ్, మహారాష్ట్ర, కర్నాటక, మణిపూర్, మేఘాలయా, మిజోరం, నాగాలాండ్, ఒడిశా, సిక్కిం, తెలంగాణ, త్రిపుర, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ప్రస్తుతం సర్ ప్రక్రియ చేపట్టారు. అయితే ఓటర్ల వివరాలను సేకరిస్తున్న బూత్ లెవల్ అధికారులకు ఈ ప్రక్రియ వల్ల లబ్ధి చేకూరనున్నది.

# దీదీని వీడిన సీనియర్ నేత.. టీఎంసీ రెబల్స్ బృందంలోకి మదన్ మిత్రా



**కోల్‌కతా:** తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి మరో జలక్ తగిలింది. సీనియర్ నేత మదన్ మిత్రా ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఇవాళ ఆయన రిపోర్టర్లతో మాట్లాడారు. తృణమూల్ పార్టీ ఇప్పుడు ముక్కలైందన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని నార్త్ 24 పరగనాస్ జిల్లాలో ఉన్న కామర్‌హాతి సీటు నుంచి ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందారు. నేను టీఎంసీలో ఉన్నానని, టీఎంసీలోనే కొనసాగుతానని, కానీ అసెంబ్లీలో మాత్రం తన రూమ్‌ను మార్చుకున్నట్లు ఆయన చెప్పారు. ఇటీవల మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ పార్టీని అనేక మంది నేతలు వీడిన విషయం తెలిసిందే. దీదీకి చెందిన పార్టీ నుంచి తప్పుకున్న మదన్ మిత్రా.. రెబల్స్ దళంలో చేరినట్లు తెలుస్తోంది.

# నోయిడాలో భారీ అగ్ని ప్రమాదం- ఇద్దరు మృతి- భవనంలో చిక్కుకున్న 50 కుటుంబాలు!



**నోయిడా:** ఉత్తరప్రదేశ్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. నోయిడాలో బుధవారం నాలుగంతస్తుల భవనంలో మంటలు చెలరేగాయి. దీంతో ఆ ప్రాంతంలో దట్టమైన పొగ అలుముకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సుమారు 50 మందిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చామని పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సెక్టార్ 66లోని మామురా గ్రామంలో ఉన్న గ్రౌండ్ ప్లస్ ఫోర్ భవనంలో పలు కుటుంబాలు అద్దెకు నివాసం ఉంటున్నాయి. అయితే, బుధవారం భవనం లోపల ఓ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనానికి ఛార్జింగ్ పెడుతున్న సమయంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఆ మంటలు ఆ ప్రాంతంలో పార్క్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాలకు కూడా వ్యాపించాయి. ఈ ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే అధికారులు అప్రమత్తమయ్యారు. మంటల్లో చిక్కుకున్న సుమారు 50 కుటుంబాలను, హైడ్రాలిక్ యంత్రాల సహాయంతో రక్షించారు. వీటి సహాయంతో కిటికీలు, భవన పైకప్పుల ద్వారా మంటల్లో చిక్కుకున్న వారిని వేగంగా ఖాళీ చేయించడం సాధ్యమైందని పోలీసులు తెలిపారు. అలాగే, ఘటనా స్థలికి అగ్నిమాపక వాహనాలను పంపించి మంటలను అదుపులోకి తీసుకువచ్చామన్నారు. స్థానిక నివాసితులను సురక్షితంగా ఖాళీ చేయించామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఈ ఘటనపై సెంట్రల్ నోయిడా డీసీపీ శైలేంద్ర సింగ్ వివరాలు వెల్లడించారు. "ఒక నివాస భవనం మొదటి అంతస్తులో ఎలక్ట్రిక్ (జుం) స్కూటర్ స్పార్కింగ్ (నిప్పురవ్వలు) కారణంగా వాహనానికి మంటలు అంటుకున్నాయి. ఆ తర్వాత, దాని చుట్టూ పార్క్ చేసిన ఇతర వాహనాలకు కూడా మంటలు వ్యాపించాయి. మంటల వల్ల వచ్చిన పొగ పై అంతస్తుల వరకు చేరాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అక్కడి నుంచి సుమారు 100కు పైగా కుటుంబాలను సురక్షితంగా బయటకు తరలించాం. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు, కానీ ఇద్దరి ఆరోగ్యం క్షీణించడంతో వారిని ఆసుపత్రికి తరలించారు. భవన నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి, అతన్ని అదుపులోకి తీసుకున్నాం. తదుపరి చర్యలు కొనసాగుతున్నాయి" అని తెలిపారు.

గురువారం, జూలై 16, 2026
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక



# 23న నే జననాయగన్ విడుదలకు రెడీ




తమిళనాడు ముఖ్యమంత్రి, కథానాయకుడు విజయ్ అభిమానులకు శుభవార్త. ఆయన కీలక పాత్రలో నటించిన ఆఖరి చిత్రం 'జన నాయగన్' విడుదల తేదీ ఖరారైంది. జులై 23న ఈ మూవీ విడుదల చేయనున్నట్లు ఓ టికెట్ బుకింగ్ యాప్ ప్రకటించింది. 24న విడుదలవుతుందని తొలుత ప్రకటించారు. కానీ ఒకరోజు ముందే వస్తోంది. దీంతో సామాజిక మాధ్యమాల వేదికగా విజయ్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ మూవీ సెన్సార్ సమస్య కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. ఈ మధ్యలో కోర్టు కేసులు, విచారణలు, సీబీఎఫ్‌సీపునః పరిశీలన తర్వాత ఇటీవల సెన్సార్ పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి 'ఏ' సర్టిఫికెట్‌ను సెన్సార్ బోర్డు జారీ చేసింది. దాదాపు 183 నిమిషాల నిడివితో 'జన నాయగన్' ప్రేక్షకుల ముందుకు రానుంది. హెచ్.వినోద్ దర్శకత్వంలో ముస్తాబైన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ని కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ నిర్మించారు. పూజా హెగ్డే కథానాయిక. మమితా బైజు కీలక పాత్ర పోషించింది.

-------

# ప్రభాస్ అంటే ..మాంచి భోజనం గుర్తుకొస్తుంది



స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే తాజాగా ప్రభాస్ గురించి చెప్పిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రభాస్‌తో కలిసి రాధేశ్యామ్ సినిమాలో నటించిన రోజులను గుర్తు చేసుకుంటూ ప్రభాస్ వ్యక్తిత్వం, ఆయన ఆతిథ్యం గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.ఇటీవల పూజా ఓ మీడియాకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో పూజా హెగ్డే మాట్లాడుతూ.. 'ప్రభాస్ పేరు చెప్పగానే నాకు ముందుగా గుర్తొచ్చేది భోజనమే అని ఆయన భోజనాన్ని దొంగిలించాలనిపిస్తుందని అన్నారు. రాధేశ్యామ్ షూటింగ్ సమయంలో ఆయన పంపించే ఫుడ్ డబ్బా కోసం అందరం ఎదురు చూసేవారని.. నాకు కూడా ప్రతిరోజూ ఎంతో రుచికరమైన వంటకాలు పంపించేవారు' అని చెప్పారు.ఆమె ఇంకా మాట్లాడుతూ.. 'రాధేశ్యామ్ షూటింగ్‌కు సంబంధించిన ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి. కానీ వాటిలో నాకు ఎక్కువగా గుర్తుండిపోయింది ప్రభాస్ పంపించే భోజనమే. ఆయన పంపించే డబ్బా ఎప్పుడూ ప్రత్యేకంగా ఉండేది. ఎంతో ప్రేమగా అందరికీ ఆహారం పంపించేవారు. నాకు కూడా చాలా రకాల వంటకాలు తినిపించారు. ఆ ఆతిథ్యాన్ని ఎప్పటికీ మర్చిపోలేను' అని తెలిపారు. ఇదిలాఉంటే.. ప్రభాస్ షూటింగ్ సెట్స్‌లో తన సమచర నటులు, సాంకేతిక నిపుణులకు ఇంటి భోజనం పంపించడం కొత్త విషయం కాదు. ఇప్పటికే సైఫ్ అలీఖాన్, కరీనా కపూర్, శ్రద్ధా కపూర్, పృథ్వీ రాజ్ సుకుమారన్ వంటి స్టార్లు ఆయన ఆతిథ్యానికి ఫిదా అయ్యారు. ఇప్పుడు పూజా హెగ్డే కూడా అదే విషయాన్ని మరోసారి ప్రస్తావించడంతో ప్రభాస్ అభిమానులు రాజు ఎక్కడ ఉన్నా రాజేరా అంటూ ఈ వ్యాఖ్యలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు.




# అల్లు అర్జున్‌తో మలయాళ దర్శకుడు బసిల్ జోసెఫ్ సినిమా

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో మలయాళ దర్శకుడు బసిల్ జోసెఫ్ సినిమా చేయబోతున్నారనే వార్తలు గత కొంతకాలంగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే ఇప్పటివరకు ఈ ప్రాజెక్టుపై అధికారిక ప్రకటన రాకపోయినా, తాజాగా బసిల్ జోసెఫ్ చేసిన ఓ సోషల్ మీడియా పోస్ట్ ఈ వార్తలకు మరింత బలం చేకూర్చింది. బసిల్ జోసెఫ్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఐకాన్ అని రాసి ఉన్న క్యాప్ ఫొటోను షేర్ చేశారు. ఈ ఒక్క పోస్టే ప్రస్తుతం టాలీవుడ్, మాలీవుడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 'ఐకాన్' అనేది అల్లు అర్జున్‌కు అభిమానులు పెట్టిన బిరుదు కావడంతో, ఈ పోస్ట్ ఆయనతో చేయబోయే సినిమాపై పరోక్షంగా ఇచ్చిన హింట్ అని నెటిజన్లు భావిస్తున్నారు. అల్లు అర్జున్, బసిల్ జోసెఫ్ కలిసి సినిమా చేయనున్నారనే ప్రచారం చాలా రోజులుగా సాగుతోంది. ఇటీవల అల్లు శిరీష్ వివాహ వేడుకలో బసిల్ జోసెఫ్ పాల్గొనడం కూడా ఈ ఊహాగానాలకు మరింత బలం ఇచ్చింది. ఇద్దరి మధ్య కథా చర్చలు ఇప్పటికే జరిగినట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే ప్రాజెక్టును ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. 'మిన్నల్ మురళి'తో సూపర్ హీరో జానర్‌లో తన సత్తా చాటిన బసిల్ జోసెఫ్, 'శక్తిమాన్' కథను అల్లు అర్జున్‌తో తెరకెక్కించ బోతున్నారనే ప్రచారం కూడా జరిగింది. అయితే ఆ వార్తలను దర్శకుడు ఇప్పటికే ఖండించారు. బన్నీతో చేయబోయేది పూర్తిగా కొత్త కథేనని స్పష్టం చేశారు. కథ వివరాలను మాత్రం గోప్యంగా ఉంచుతున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను అల్లు కుటుంబానికి చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ నిర్మించే అవకాశాలు ఉన్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. అధికారిక ప్రకటన వచ్చే వరకు దీనిపై పూర్తి స్పష్టత రానప్పటికీ, ప్రాజెక్ట్ దాదాపు ఖరారైనట్లే ప్రచారం సాగుతోంది.ప్రస్తుతం అల్లు అర్జున్ దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'రాకా' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా పూర్తయ్యాక దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో మరో భారీ ప్రాజెక్ట్ చేయనున్నారు. ఈ రెండు చిత్రాల తర్వాతే బసిల్ జోసెఫ్ దర్శకత్వంలో సినిమా ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సమాచారం ప్రకారం, అట్లీ సినిమా బన్నీ కెరీర్‌లో 22వ చిత్రం కాగా, లోకేష్ మూవీ 23వ చిత్రంగా రానుంది. బసిల్ జోసెఫ్ ప్రాజెక్ట్‌ను అల్లు అర్జున్ తన 25వ చిత్రంగా ఎ÷-లాన్ చేస్తున్నట్లు టాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది.



# వారణాసి కోసం 14 నెలలుగా పనిచేస్తున్నా

## రాజమౌళి టేకింగ్ డిఫరెంట్ అంటూ ప్రియాంక కామెంట్

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ హీరోగా భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రం 'వారణాసి'. మహేశ్‌కు జోడీగా ప్రియాంక చోప్రా మందాకిని పాత్రలో సందడి చేయనున్నారు. తాజాగా ఓ పాడ్ కాస్ట్‌లో ఆమె ఈ సినిమా గురించి మాట్లాడారు. నేను 14 నెలలుగా ఈ సినిమా కోసం పనిచేస్తున్నాను. సినిమాను తెరకెక్కించడానికి రాజమౌళి చాలా సమయం తీసుకుంటారనే సంగతి మనందరికీ తెలిసిందే. ప్రతి సన్నివేశాన్ని క్షుణంగా పరిశీలిస్తారు. ఈ సినిమాలో నేను అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చాలా చేశాను. ప్రస్తుతానికి నేనింతకంటే ఎక్కువ చెప్పలేనని తెలిపారు. ఇటీవల కూడా వారణాసి గురించి ప్రియాంక మాట్లాడారు. తాను ఇప్పటివరకు చేసిన సినిమాలకు ఇది పూర్తి భిన్నమైనదని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ సినిమాలోని కీలక సన్నివేశాల షూటింగ్ పూర్తి చేసినట్లు రాజమౌళి తెలిపారు. అక్టోబరు నాటికి మొత్తం షూటింగ్ పూర్తవుతుందని వెల్లడించారు. ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలు పెట్టి, వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరి నుంచి ప్రమోషన్స్ ప్రారంభించే అవకాశం ఉంది. ఏప్రిల్ 7న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది



# చరణ్ కోసం సుకుమార్ మాస్టర్ ప్లాన్..




మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్, ప్రముఖ దర్శకుడు సుకుమార్ కలయికలో రాబోతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ఆర్‌సీ17'పై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'రంగస్థలం' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో ప్రతి చిన్న విషయం కూడా ఆసక్తిని రేకెత్తిస్తోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఓ సంచలన వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో లేడీ సూపర్ స్టార్ నయనతార ఓ అత్యంత కీలకమైన పాత్రలో కనిపించనున్నారని ప్రచారం జోరుగా సాగుతోంది.సుకుమార్ సినిమాల్లో కేవలం హీరో, హీరోయిన్లు మాత్రమే కాకుండా కథాగమనాన్ని మలుపు తిప్పే సహాయ పాత్రలు కూడా చాలా బలంగా, గుర్తుండిపోయేలా ఉంటాయి. ఈ నేపథ్యంలోనే 'ఆర్‌సీ17' కోసం నయనతారకు ఒక పవర్‌ఫుల్ పాత్రను ఆయన డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ఇందులో ఆమె హీరోయిన్‌గా కాకుండా, కథకు వెన్నెముకగా నిలిచే పాత్రను పోషించనున్నారని సమాచారం. దక్షిణాదిలో అగ్రతారగా వెలుగొందుతున్న నయన్ ఎంట్రీతో ఈ సినిమాకు పాన్-ఇండియా స్థాయిలో మరింత బలం చేకూరుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇటీవలే మెగాస్టార్ చిరంజీవితో కలిసి ఆమె నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు రామ్ చరణ్ సినిమాలో కూడా ఆమె నటిస్తే, సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకడం ఖాయం. అయితే, ఈ వార్తలపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.మరోవైపు ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇటీవలే సుకుమార్ ఈ సినిమా ఫైనల్ నెరేషన్‌ను రామ్ చరణ్‌కు వినిపించగా, ఆయన కథ పట్ల పూర్తి సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. స్క్రిప్ట్‌కు తుది మెరుగులు దిద్దేందుకు సుకుమార్ తన రచయితల బృందంతో కలిసి ప్రస్తుతం అమెరికాలో ఉన్నట్లు తెలుస్తోంది. కథలోని భావోద్వేగాలు, పాత్రల మధ్య సంబంధాలను మరింత బలంగా తీర్చిదిద్దే పనిలో ఆయన నిమగ్నమైనట్లు సమాచారం. అంతా అనుకున్న ప్లాన్ ప్రకారం జరిగితే, ఈ ఏడాది అక్టోబర్‌లో పూజా కార్యక్రమాలతో సినిమాను లాంఛనంగా ప్రారంభించాలని నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవలే 'పెద్ది' చిత్రంతో మరో బ్లాక్‌బస్టర్‌ను తన ఖాతాలో వేసుకున్న రామ్ చరణ్, ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ కోసం సిద్ధమవుతూ విశ్రాంతి తీసుకుంటున్నారు. మొత్తం మీద 'రంగస్థలం' కాంబినేషన్ రిపీట్ అవుతుండటం, దానికి నయనతార లాంటి స్టార్ యాక్టర్ తోడవుతున్నారనే వార్తలు మెగా అభిమానుల్లో, సినీ ప్రియుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈ క్రేజీ ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక వివరాల కోసం మెగా ఫ్యాన్స్ ఎంతో ఉత్సుకతతో ఎదురుచూస్తున్నారు.